

అమలాపురం ఉష్ణోగ్రతలు
గరిష్ఠం : 33 (సోమవారం)
కనిష్ఠం : 28

సదాశయంతో.. 6



అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ మహేష్‌కుమార్, జేసీ నిషాంతి

ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 225 అర్జీలు

స్వీకరించిన కలెక్టర్, జేసీ

అమలాపురం, మే 19 (ఆంధ్రజ్యోతి): ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులను విశ్లేషించి హేతుబద్ధమైన పరిష్కారాలు చూపాలని కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ అధికారులకు సూచించారు. అమలాపురంలోని కలెక్టరేట్‌లో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమ నిర్వహణలో కలెక్టర్‌తోపాటు జాయింట్ కలెక్టర్ టి.నిషాంతి, డీఆర్వో రాజకుమారి, డ్వామా పీడీ మధుసూదన్, సర్వశిక్షాభియాన్ ఏపీసీ జి.మమ్మి తదితరులు ఫిర్యాదుదారుల నుంచి సుమారు 225 అర్జీలను స్వీకరించారు. పీజీఆర్ఎస్ విభిన్న అర్జీలు వస్తున్నాయని, ప్రభుత్వ సేవలపై ప్రజల్లో సంతృప్తి స్థాయిని మరింత పెంచేలా అధికారులు మరింత పరిష్కరించడానికి కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రాధాన్యం ఇస్తోందని, దీని దృష్ట్యా అధికారులంతా వచ్చిన ఫిర్యాదులను అధ్యయనంచేసి క్షేత్రస్థాయి పర్యటనకు వెళ్లి వాటిని అర్థం చేసుకుని పరిష్కార మార్గాలు చూపినప్పుడే ప్రభుత్వానికి మంచిపేరు వస్తుందన్నారు. పీజీఆర్ఎస్ అర్జీలు పునరావృత్తమైతే అందుకు సంబంధిత అధికారులే బాధ్యత వహించాలని పేర్కొన్నారు. జిల్లాలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ఫిర్యాదుదారుల నుంచి అర్జీలు స్వయంగా స్వీకరించి వారితో మాట్లాడి వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని కలెక్టర్, జాయింట్ కలెక్టర్ భరోసా ఇచ్చారు. జిల్లాస్థాయి అధికారులు విధిగా ఫిర్యాదుదారులతో మాట్లాడిన తరువాతే పరిష్కారం చూపాల్సిందిగా సూచించారు. జిల్లాస్థాయిలోని వివిధ స్థాయి అధికారులు కార్యక్రమంలో పాల్గొని కలెక్టర్, జేసీలు ఇచ్చిన ఆదేశాలపై స్పందించారు.



ప్రభుత్వ ప్రధాన కార్యదర్శితో కాన్ఫరెన్సులో మాట్లాడుతున్న కలెక్టర్ మహేష్‌కుమార్, జేసీ నిషాంతి

పథకాల అమలులో పారదర్శకంగా పనిచేయాలి : కలెక్టర్

అమలాపురం, మే19(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ప్రాధాన్యతా అంశాలపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించి ఫలితాలు పొందాలని కలెక్టర్ మహేష్‌కుమార్ సోమవారం కలెక్టరేట్‌లో జరిగిన సమావేశంలో ఆదేశించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలుతీరు, పర్యవేక్షణ, అన్న క్యాంటీన్ల నిర్వహణ, పీతల హేచరీ నిర్మాణం, సముద్రపు నాచు తయారీపై ఎక్స్‌పోజర్ విజిట్ చేయాల్సిందిగా సూచించారు. సచివాలయాల పనితీరును మెరుగుపరచాల్సిందిగా ఆర్డీవోలను ఆదేశించారు. పథకాల అమలు తీరుపై పాదర్శకంగా పని చేయాలని కలెక్టర్ కోరారు. రెవెన్యూ సదస్సులు, రీసర్వే అంశాల్లో ఫిర్యాదులను పెండింగ్ ఆస్కారం లేకుండా పరిష్కరించాలని కోరారు. మత్స్యకార మహిళలు 25 మందితో ఈ నెల 26 నుంచి మూడు రోజులపాటు పరిశ్రమలపై అవగాహన కోసం ఎక్స్‌పోజర్ విజిట్ నిర్వహించాల్సిందిగా కలెక్టర్ సూచించారు. ఈ సమావేశంలో జిల్లా జాయింట్ కలెక్టర్ నిషాంతి, డీఆర్వో రాజకుమారి, ఆర్డీవో శ్రీకర్, కె.మాధవి, డి.అఖిల, పొల్యూషన్ బోర్డు అధికారి శంకరరావు, జిల్లా మత్స్యకార అధికారి పీవీ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

పీఎంఏజీవై పథకంపై ప్రణాళికలు సిద్ధం చేయండి

ఎంపీడీవోలను ఆదేశించిన జాయింట్ కలెక్టర్ నిషాంతి

అమలాపురం,మే19(ఆంధ్రజ్యోతి): ప్రధాన మంత్రి ఆదర్శ గ్రామ యోజన పథకం ద్వారా 50శాతం కంటే ఎక్కువగా షెడ్యూల్డు కులాల జనాభా నివసించే గ్రామాలను సమగ్రంగా అభివృద్ధి చేయడమే పథక లక్ష్యమని జాయింట్ కలెక్టర్ టి.నిషాంతి అన్నారు. సోమవారం పీఎంఏజీవై పథకం అమలు తీరుపై జిల్లాలోని ఎంపీడీవోలతో టెలికాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ప్రభుత్వం ఎస్సీ కులాల ప్రజలు ఎక్కువగా జీవించే ప్రాంతాల అభివృద్ధే లక్ష్యంగా అమలు చేస్తున్న ఈ పథకాన్ని ఎంపిక చేసిన గ్రామంలో ప్రజల కనీస అవసరాలు తీర్చేలా పనులు పూర్తి చేయాల్సిందిగా సూచించారు. సంస్థాగత మౌలిక సదుపాయాలను, అభివృద్ధి చేయడంతోపాటు సామాజిక, ఆర్థిక అసమానతలను తగ్గించాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అమలుచేస్తున్న పథకాలను సమన్వయం చేయడం ద్వారా సంక్షేమ లబ్ధిని ప్రజలకు అందిస్తున్నట్టు తెలిపారు. భారత నిర్మాణ్, ప్రధానమంత్రి గ్రామ సడక్ యోజన, సర్వశిక్షాభియాన్, గ్రామీణ ఉపాధి హామీ చట్టం వంటి పథకాలు ఈ గ్రామంలో అమలు చేస్తామన్నారు. కోనసీమ జిల్లాలో ఎస్సీ జనాభా 50 శాతం కంటే ఎక్కువ ఉన్న 55 గ్రామాలను ఇందు కోసం ఎంపిక చేశామని, ఇప్పటివరకు 34 గ్రామాల్లో కార్యచరణ ప్రణాళికలు ఎంపీడీవోలు సమర్పించారని, మిగిలిన ప్రణాళికలను త్వరితగతిన సమర్పించాలని జేసీ ఆదేశించారు. తాగునీరు, పారిశుధ్యం, విద్య, ఆరోగ్యం, రవాణా, విద్యుత్, గృహనిర్మాణం వంటి ప్రాథమిక సదుపాయాలను మెరుగుపరచాల్సిందిగా సూచించారు. పలువురు ఎండీవోలకు జేసీ టెలికాన్ఫరెన్సులో సూచనలిచ్చారు.

'నెలరోజులు యోగా కార్యక్రమాలు'

అమలాపురం, మే19 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 21వ తేదీ నుంచి జూన్ 21వ తేదీ వరకు అంతర్జాతీయ యోగా డేలో భాగంగా మండల, గ్రామ, వార్డు స్థాయిలో ఐదు రోజులపాటు యోగా శిక్షణా కార్యక్రమాలు నిర్వహించాలని కలెక్టర్ మహేష్‌కుమార్ తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి కె.విజయానంద్, ఇతర ప్రభుత్వ శాఖల అధికారులు సోమవారం అమరావతి నుంచి వీడియో కాన్ఫరెన్సు నిర్వహించి జిల్లా కలెక్టర్లు, జాయింట్ కలెక్టర్లతో మాట్లాడారు. ప్రాజెక్టు మోనటరింగ్ గ్రూపు విధివిధానాలు, నెల రోజులపాటు జరిగే యోగా కార్యక్రమాల నిర్వహణ, ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా రేషన్, దీపం-2, సబ్సిడీ రాయితీలు వంటి అంశాలపై కాన్ఫరెన్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ పరంగా చేపడుతున్న అనేక సంక్షేమ, అభివృద్ధి పథకాలపై ప్రభుత్వ కార్యదర్శి వీడియో కాన్ఫరెన్సు ద్వారా జిల్లా అధికారులకు దిశానిర్దేశం చేశారు.

26న ఐటీఐ సర్టిఫికెట్ల వెరిఫికేషన్

అమలాపురం టౌన్, మే 19(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ, ప్రైవేటు ఐటీఐల్లో మొదటి విడత ప్రవేశం కోసం సర్టిఫికెట్ల ధ్రువీకరణ కార్యక్రమం ఈనెల 26వ తేదీన నిర్వహిస్తామని కోనసీమ జిల్లా అడ్మిషన్ కన్వీనర్ ఎం.గోపాలవర్మ ఓ ప్రకటనలో తెలిపారు. కోనసీమ జిల్లాలో గల ప్రభుత్వ, ప్రైవేటు ఐటీఐల్లో 2025-26 సంవత్సరానికిగాను ప్రవేశం కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులంతా తమ దగ్గరలో ఉన్న ఏదైనా ప్రభుత్వ ఐటీఐ లేదా జిల్లా ఉపాధి కార్యాలయం అమలాపురంలో ఏర్పాటు చేసిన వెరిఫికేషన్ కేంద్రంలో ఒరిజినల్ సర్టిఫికెట్లు, ఆన్‌లైన్ నమోదు పత్రంతో హాజరుకావాలని ఆయన కోరారు. సర్టిఫికెట్ల వెరిఫికేషన్ చేయించుకోలేని అభ్యర్థులు కౌన్సెలింగ్‌కు అర్హులు కాదని వేణుగోపాలవర్మ తెలిపారు. ఇప్పటివరకు ఆన్‌లైన్ ద్వారా 629 దరఖాస్తులను స్వీకరించామని, వెరిఫికేషన్ అయిన దరఖాస్తులు 150 అని తెలిపారు. ప్రభుత్వ ఐటీఐలలో 644, ప్రైవేటు ఐటీఐల్లో 1684 సీట్లు ఉన్నాయని తెలిపారు. ఈనెల 26వ తేదీన సాయంత్రం 5 గంటల వరకు సర్టిఫికెట్‌ల వెరిఫికేషన్ జరుగుతుందని ఆయన పేర్కొన్నారు.

మండే ఎండలకు... మందు!





ఊదిపారేస్తున్నారంతే...

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో గతేడాది ఏప్రిల్‌లో బీర్లు, ఇతర ఐఎంఎల్ మద్యం విక్రయాలు కలిపి రూ.276 కోట్లు జరిగాయి. ఈ ఏడాది ఏప్రిల్‌లో విక్రయాలు రూ.293 కోట్లకు పెరిగాయి. ఇందులో అత్యధికంగా బీర్లు అమ్ముడయ్యాయి. గతేడాది ఏప్రిల్‌లో ఉమ్మడి జిల్లాలో 1,21,396 కేసుల బీర్లు విక్రయించగా ఈ ఏడాది ఏప్రిల్‌లో ఏకంగా 2,81,637 కేసుల బీర్లు మందుబాబులు తాగేశారు. బీర్ల విక్రయాలు అప్పటితో పోల్చితే ఈసారి 133 శాతానికిపైగా పెరిగాయి.

- కాకినాడ జిల్లాలో 2024 ఏప్రిల్‌లో రూ.95.52 కోట్ల విలువైన మద్యం అమ్ముడైంది. ఇందులో 41,940 కేసుల బీర్లు ఉండగా, ఐఎంఎల్ మద్యం 96,317 కేసులు ఉన్నాయి. ఈ ఏడాది ఏప్రిల్‌కు వచ్చేసరికి ఈనెలలో కాకినాడ జిల్లాలో విక్రయాలు రూ.104కోట్లకు పెరిగింది. ఒక్క బీర్లే ఏకంగా 97,796 కేసులు అమ్ముడయ్యాయి. కాకినాడ నార్త్ స్టేషన్ పరిధిలో గత నెలలో ఏకంగా రూ.26కోట్ల మద్యం అమ్ముడైంది. కాకినాడ సౌత్ స్టేషన్ పరిధిలో రూ.18 కోట్లు, తుని పరిధిలో రూ.15.84 కోట్ల విక్రయాలు జరిగాయి.
- తూర్పుగోదావరి జిల్లాలో గతేడాది ఏప్రిల్ నెలలో రూ.90.76 కోట్ల విలువైన మద్యం విక్రయాలు జరగ్గా, ఈ ఏడాది 100.23కోట్ల మద్యం అమ్ముడైంది. ఒక్క బీర్ల విక్రయాల్లో ఏకంగా 114 శాతం పెరుగుదల నమోదైంది. అత్యధికంగా రాజమహేంద్రవరం నార్త్ స్టేషన్ పరిధిలో గత నెలలో రూ.22.66 కోట్లు మద్యం విక్రయాలు జరగ్గా, బీర్ల విక్రయాల్లో 131 శాతం వృద్ధి నమోదైంది. రాజమహేంద్రవరం దక్షిణం పరిధిలో రూ.20.44 కోట్లు, నిడదవోలు పరిధిలో 13.44కోట్లు, దేవరపల్లి 12.33 కోట్లు, కోరుకొండ 8.91 కోట్లు చొప్పున మద్యం విక్రయాలు జరిగాయి. దేవరపల్లి సర్కిల్ పరిధిలో గతేడాది ఏప్రిల్‌లో 3,623 కేసుల బీర్లు అమ్ముడైతే ఈ ఏడాది ఏప్రిల్‌లో ఏకంగా 9,253 బీర్ల కేసులు విక్రయించారు. బీర్ల విక్రయాల్లో గతేడాదితో పోల్చితే 155 శాతం అధికం.
- డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో 2024 ఏప్రిల్‌లో రూ.90.11 కోట్ల మద్యం విక్రయాలు జరగ్గా ఈ ఏడాది ఏప్రిల్‌లో రూ.88.81 కోట్లు నమోదయ్యాయి. ఇక్కడ గతేడాదితో పోల్చితే ఏప్రిల్‌లో విక్రయాలు కొంత తగ్గాయి. ప్రధానంగా ఈ జిల్లాలో 2024 ఏప్రిల్‌లో ఈ జిల్లాలో 95,444 కేసుల ఐఎంఎల్ మద్యం అమ్ముడైతే ఈ ఏడాది ఏప్రిల్‌లో 1,17,484 కేసుల ఐఎంఎల్ అమ్ముడైంది. బీరు కేసులు అప్పట్లో 34,036 విక్రయిస్తే.. గత నెలలో 79,005 కేసులు విక్రయించారు. బీర్ల విభాగంలో అమ్మకాలు అప్పటితో పోల్చితే 132 శాతం పెరిగాయి.

(కాకినాడ/ రాజమహేంద్రవరం- ఆంధ్రజ్యోతి)

వేసవి ఉపశమనం కోసం మందుబాబులు తెగ తాగేస్తున్నారు. దీంతో మద్యం విక్రయాలు రయ్‌మని పరుగులు తీస్తున్నాయి. వేసవి తీవ్రత కారణంగా గత నెల నుంచి మద్యం విక్రయాలు భారీగా పెరిగిపోయాయి. ఒక్క ఏప్రిల్‌లోనే మందుబాబులంతా కలిపి ఉమ్మడి జిల్లాలో రూ.293 కోట్ల మద్యం తాగేశారు. గతేడాది ఇదేనెలలో విక్రయాలతో పోల్చితే రూ.17 కోట్లు అధికం. బీర్ల విక్రయాలైతే ఏకంగా 133 శాతం పెరిగాయి. గతేడాది ఏప్రిల్‌లో ఉమ్మడి జిల్లాలో మందుబాబులు 1.21 లక్షల బీరు కేసులు తాగేస్తే ఈ ఏడాది ఏప్రిల్‌లో 2.81 లక్షల బీరు కేసులు ఎత్తేశారు. విభజిత జిల్లాల వారీగా పరిశీలిస్తే కాకినాడ జిల్లాలో గతేడాది ఏప్రిల్‌లో రూ.95.52 కోట్లు అమ్మకాలుంటే ఈ ఏడాది ఏప్రిల్‌లో రూ.104 కోట్లకు చేరింది. తూర్పుగోదావరి జిల్లాలో గతేడాది ఏప్రిల్‌లో రూ.90.76 కోట్లు ఉంటే ఇప్పుడు రూ.100.23 కోట్లకు చేరింది. కోనసీమను మినహాయిస్తే ఈ రెండు జిల్లాల్లో విక్రయాలు భారీగా పెరిగాయి.

ఈనెలలో అప్పుడే రూ.150 కోట్లకుపైగానే..

మే నెలలోను మందుబాబులు తగ్గేదేలే అన్నట్టు తెగ తాగేస్తున్నారు. ఇప్పటివరకు కాకినాడ జిల్లాలో రూ.53 కోట్ల విలువైన మద్యం తాగేశారు. బీరు కేసులు గతేడాది మే నెల 16 వరకు జిల్లాలో 24,339 విక్రయించగా ఇప్పుడు 56,375 అమ్ముడయ్యాయి. కోనసీమ జిల్లాలో గతేడాది మే నెల మొత్తం మీద రూ.98.88 కోట్ల సరుకు విక్రయించగా ఈనెలలో ఇప్పటివరకు రూ.45.41కోట్ల మద్యం అమ్ముడైంది. తూర్పుగోదావరి జిల్లాలో 58,950 ఐఎంఎల్ కేసులు, 50,587 బీరు కేసులు విక్రయించడంతో రూ.49.46 కోట్ల విక్రయాలు నమోదయ్యాయి. వాస్తవానికి గత వైసీపీ ప్రభుత్వంలో మద్యం ధరలు మందుబాబులకు షాక్ కొట్టాయి. నాసిరకం బ్రాండ్లకు ప్రీమియం ధరలు వసూలు చేసి వందల కోట్లు పిండేశారు. ప్రస్తుత ప్రభుత్వం ధరలు అమాంతం తగ్గించేసింది. బీరు, ఐఎంఎల్ ప్రముఖ బ్రాండ్లను అన్ని దుకాణాల్లో అందుబాటులో ఉంచింది. ధరలు తగ్గడం.. వేసవితో మందుబాబులు తెగ తాగేయడంతో అమ్మకాలు పెరిగాయి.

ఉమ్మడి జిల్లాలో బీర్లు పొంగాయ్

- వేసవి ఉపశమనం పేరుతో తెగతాగేశారు
- ఉమ్మడి తూ.గో.జిల్లాలో పెరిగిన అమ్మకాలు
- ఏప్రిల్‌లో రూ.293 కోట్ల మద్యం విక్రయాలు
- గతేడాది పోల్చితే రూ.17 కోట్లు అధికం
- రికార్డు స్థాయిలో బీర్లను తాగేసిన ప్రియులు
- గత నెలలో 2.81 లక్షల బీరు కేసులు
- గతేడాది ఇదే నెలలో 1.21 లక్షల కేసులే
- గతేడాదితో పోల్చితే 133 శాతం అధికం
- ఈ నెలా మద్యం విక్రయాలు రయ్
- 16 నాటికి రూ.150 కోట్ల మేర సేల్స్
- బీరు కేసులు 1.49 లక్షల విక్రయం

పంట కాల్వలపై ఎందుకీ నిర్లక్ష్యం!





వాడ్రేవులపల్లి శివారు చాకలిపాలెంలో ప్రధాన పంటకాల్వలో పేరుకుపోయిన చెత్తనిల్వలు.. మొండెపులంక లాకు సమీపంలో కాల్వలో భారీ వృక్షం

- పూడికతీత పనులు లేనట్టే.. తూటు తొలగింపు వరకే పరిమితం
- బలహీనపడుతున్న పంటకాల్వలు.. సాగునీరు పంపిణీలో అనేక అడ్డంకులు
- గత ఏడేళ్లుగా పూడికతీత పనులు నిల్.. ఈసారీ అదే పరిస్థితి
- జిల్లాలో 190 కిలోమీటర్ల మేర ప్రధాన పంటకాల్వలు

పి.గన్నవరం, మే19(ఆంధ్రజ్యోతి): గత ఐదేళ్ల కాలంలో వైసీపీ ప్రభుత్వం పంటకాల్వలను పూర్తిగా భ్రష్టుపట్టించింది. పంటకాల్వలపై దృష్టి సారించకపోవడంతో నేడు అధ్వానంగా మారాయి. కాల్వల్లో పూడికతీత, చానల్స్ బలపర్చడం, రక్షణగోడలు నిర్మాణం తదితర అంశాలను పూర్తిగా విస్మరించడంతో కాల్వల్లో సాగునీరు శివారు ప్రాంతాలకు వెళ్లే పరిస్థితి లేకుండా పోయింది. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత అయినా.. కాల్వలు బాగుపడతాయని రైతాంగం ఎంతో ఆశగా ఎదురుచూసింది. తీరా చూస్తే ఈ వేసవిలో కూడా క్లోజర్ పనులకు కూటమి ప్రభుత్వం మొండిచెయ్యి చూపింది. 2017 టీడీపీ ప్రభుత్వం హయాంలో ప్రధాన పంటకాల్వలను అభివృద్ధి చేశారు. అప్పటి నుంచి 2020లో వైసీపీ ప్రభుత్వం కొద్దిపాటి పనులు మినహా పంటకాల్వలను ముట్టుకున్న పాపానపోలేదు. ప్రతి ఏడాది కాలువ విరామ సమయంలో ఉపాధి హామీ కూలీలతో మొక్కుబడి పనులు నిర్వహించి చేతులు దులుపుకుంటున్నారు. ఈసారి కూడా కూటమి ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా కాల్వలు, డ్రైన్లలో తూటు తొలగింపు, అక్కడక్కడా పూడికతీత పనులు నిర్వహించేందుకు నిధులు కేటాయించింది. వాస్తవంగా ఈ నిధుల్లో 75 శాతం నిధులు తూటు తొలగింపునకు సరిపోతుందని, ప్రతి ఏడాది ఈ తూటు తొలగింపు షరామామూలేనని పలువురు విమర్శలు కూడా చేస్తున్నారు. కోనసీమ జిల్లాలోని ఈస్ట్రన్ డెల్టాలో కొన్ని మండలాలు, సెంట్రల్ డెల్టాలో కొన్ని మండలాలు ఉన్నాయి. మండపేట, రామచంద్రపురం, కె.గంగవరం, ఆలమూరు, కపిలేశ్వరపురం మండలాలు ఈస్ట్రన్ డెల్టాలో ఉండగా మిగిలిన మండలాలు సెంట్రల్ డెల్టాలో ఉన్నాయి. మొత్తంగా చూసుకుంటే బొబ్బర్లంక నుంచి పంటకాల్వలను పరిశీలిస్తే... అమలాపురం కాల్వ చల్లపల్లి వరకు 64.02 కిలోమీటర్లు, పి.గన్నవరం కాల్వ సఖినేటిపల్లి వరకు 72.03 కిలోమీటర్లు, బ్యాంక్‌కెనాల్ కుండలేశ్వరం వరకు 75.06 కిలోమీటర్లు, బొబ్బర్లంక నుంచి ర్యాలీ వరకు 13 కిలోమీటర్లు మొత్తంగా చూసుకుంటే 190 కిలోమీటర్లు వరకు పంటకాల్వ విస్తరించి ఉంది. దీంతోపాటు జిల్లాలోని బ్రాంచ్ ఛానల్స్, ఛానల్స్‌కు సంబంధించి 468 కిలోమీటర్ల మేర చిన్న కాల్వలు విస్తరించి ఉన్నాయి. వీటికి సంబంధించి ప్రధాన పంటకాల్వల్లో ఐదేళ్లకు ఒకసారి పూడికతీత పనులు చేపట్టవల్సి ఉంది. అలాగే చానల్స్, బ్రాంచ్‌చానల్స్‌కు ప్రతి మూడేళ్లకు ఒకసారి పూడికతీత పనులు చేపట్టవల్సి ఉంది. అయితే పూడికతీత పనులు చేపట్టి ఏడేళ్లు గడుస్తున్నా... కనీసం పట్టించుకోవడం లేదు. వైసీపీ ఐదేళ్ల కాలంలో కాల్వలు వంక కనీసం చూడని పరిస్థితి ఉంది. నిర్ణిత సమయంలో పూడికతీత పనులు చేపట్టకపోతే కాల్వలు సామర్థ్యం తగ్గిపోవడంతో బలహీనంగా మారిపోతాయి. అలాగే పూడికతీత పెరిగిపోయి కాల్వలకు పూర్తిస్థాయిలో నీరు వదిలినప్పటికీ శివారు ప్రాంతాలకు వెళ్లలేని పరిస్థితి ఉంది. ఇప్పటికే పలుచోట్ల కాల్వలు సామర్థ్యం తగ్గిపోవడంతో గట్లు బలహీనపడి సాగునీరు ఇరువైపులకు దారితీస్తుంది. అయితే తూటు తొలగింపు నిధులతోపాటు పలుచోట్ల డీపీలతోపాటు పూడికతీత తొలగింపునకు నిధులు మంజూరైనట్టు అధికారులు చెబుతున్నా పనులు ప్రారంభించిన దాఖలాలు లేవు. ప్రధాన పంటకాల్వల్లో నీరు లేకపోవడంతో అప్పుడప్పుడు కాల్వలో అడ్డుపడ్డ భారీ వృక్షాలు ఇప్పుడు బయటపడ్డాయి. అలాగే పంటకాల్వల్లో పలుచోట్ల నిర్మించిన వంతెనల పిల్లర్లకు భారీగానే చెత్త అడ్డుపడింది. కనీసం ఈ చెట్లను, అడ్డుపడ్డ చెత్తనైనా తొలగిస్తారా అని పలువురు ప్రశ్నిస్తున్నారు. చెత్తను, ఇవి తొలగించకపోతే నీటిపారుదలకు ఆటంకమే.



డ్రిల్లింగ్ చేస్తున్న రిగ్

పాశర్లపూడిలంకలో రీడ్రిల్లింగ్

మామిడికుదురు, మే 19 (ఆంధ్రజ్యోతి): చమురు, సహజ వాయువుల సంస్థ పాశర్లపూడిలంకలో గ్యాస్ నిక్షేపాల కోసం రీడ్రిల్లింగ్ పనులను ప్రారంభించింది. ఇ-2000-3 రిగ్ ద్వారా డివియేషన్ ప్రక్రియ ద్వారా వైనతేయ నది అంతర్భాగంలో డ్రిల్లింగ్ చేస్తున్నారు. పాశర్లపూడిలంకలోని సైట్‌లో ప్రస్తుతం రెండు బావుల ద్వారా గ్యాస్ ఉత్పత్తి జరుగుతోంది. మరో బావి నిరుపయోగంగా మారగా నాల్గో బావిలో డ్రిల్లింగ్ చేస్తున్నారు. 2910 మీటర్ల లక్ష్యంతో ఈ డ్రిల్లింగ్ పనులను సంబంధిత సిబ్బంది నిర్వహిస్తున్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర కోకో సాగురైతు సంఘ సహాయ కార్యదర్శి ప్రసాద్

జిల్లాలో కోకో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలి

కోకో జిల్లా రైతుల సమావేశంలో తీర్మానం

అంబాజీపేట,మే19(ఆంధ్రజ్యోతి): జిల్లాలో కొబ్బరి తరువాత అధికంగా సాగు చేస్తున్న కోకో గింజల కొనుగోళ్లకు రెండు కేంద్రాలను ఏర్పాటుచేయాలని రాష్ట్ర కోకో సాగు రైతు సంఘ సహాయ కార్యదర్శి కొప్పిశెట్టి ఆనంద వెంకటప్రసాద్ డిమాండ్ చేశారు. అంబాజీపేట కృషీవల కోకోనట్ ఫార్మర్స్ ప్రొడ్యూసర్స్ కంపెనీ కార్యాలయంలో జిల్లా కోకో రైతుల సమావేశం జిల్లా బీకేఎస్ అధ్యక్షులు చేకూరి సూర్యనారాయణరాజు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ప్రసాద్ మాట్లాడుతూ ప్రభుత్వం కోకో సాగు కోసం ఎన్నో పథకాలను ప్రవేశపెట్టి రైతులను ప్రోత్సహిస్తోందని, కానీ కోకో గింజల విషయంలో కొనుగోలు కేంద్రాలు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామన్నారు. కేవలం కొన్ని ప్రైవేట్ కంపెనీలు ఇతర ప్రాంతాల నుంచి వారు నచ్చిన ధరలకు కొనుగోలు చేస్తున్నారని, దీనివల్ల రైతులు తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. కోకో రైతులకు పెట్టుబడులు కూడా రావడంలేదన్నారు. కోకో గింజలకు ప్రస్తుతం అంతర్జాతీయ ధర కిలో రూ.940 ఉండగా ప్రైవేటు వ్యక్తులు కిలో రూ.500లోపు కొనుగోలు చేస్తున్నారని అంతర్జాతీయ ధరకే కొనుగోళ్లు చేయాలని డిమాండ్ చేశారు. ముఖ్యంగా విదేశీ గింజల దిగుమతులు నిలుపుదల చేయాలని.. ధరలు నిర్ణయించేవరకూ రైతులు, కంపెనీలు కొనుగోళ్లు, అమ్మకాలు ఆపాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో జిల్లా కోకో రైతుల సంఘం అధ్యక్షుడు ఉప్పుగంటి భాస్కరరావు, రైతులు దంగేటి గిరిధర్, అడబాల రాజమోహన్, రెడ్డి రామకృష్ణ, అయ్యగారి శ్రీనివాస్ పాల్గొన్నారు.

సదాశయంతో..

తోటి వారికి సాయపడు.. అన్నది మన సంస్కృతిలోనే ఓ భాగం. మంచి ఆశయంతో పనిచేయడం అంటే మహోపకారం చేసినట్టే. దీనికి ఆగర్భ శ్రీమంతులో, కోట్లకు పగడలెత్తినవారో కానక్కరలేదు. సాటి వారికి కాస్త సాయపడాలనే తపన ఉంటే చాలు. అదే ఎందరికో పెన్నిధి. ఇలా సదాశయంతో తమ వంతు సేవ చేయడానికి సమాజంలో ఎందరో మనకు కనిపిస్తూ ఉంటారు. ఇంత మంచి మనసు ఉన్న కొందరి పరిచయం ఇలా...

మంచి మనసున్న చిరు వ్యాపారి!



రాత్రి సమయంలో ప్రయాణికులకు మంచినీరు అందిస్తున్న ఆంజనేయరెడ్డి



ఆంజనేయరెడ్డిని అభినందిస్తున్న మంత్రి దుర్గేష్

25 ఏళ్లుగా చలివేంద్రం.. కాకినాడలో ఏడాది పొడవునా నిర్వహణ

ఆయన ఒక చిరువ్యాపారి. రోడ్డు పక్కన ప్లాస్టిక్ సామాన్లు అమ్ముకుంటూ జీవనోపాధి పొందుతూ, తాను సంపాదించిన దాంట్లో కొంత సొమ్మును సామాజిక సేవా కార్యక్రమాలకు వెచ్చిస్తున్నాడు. సేవా కార్యక్రమాలకు అవరోధంగా మారుతుందని భావించి వివాహం చేసుకోలేదు. ఏడాదిలో 365 రోజులు చలివేంద్రం నిర్వహిస్తూ రెండున్నర దశాబ్దాలుగా ప్రజల దాహార్తిని తీరుస్తున్నాడు. కాకినాడ రమణయ్యపేట ఏపీఐఐసీ కాలనీకి చెందిన అనపాల ఆంజనేయరెడ్డి రోడ్డుపక్కన ప్లాస్టిక్ సామాన్లు విక్రయిస్తూ జీవనోపాధి పొందుతున్నాడు. తాను సంపాదించిన ఆదాయంలో సగభాగం సేవా కార్యక్రమాలకు వెచ్చిస్తున్నాడు. తొలుత 2000 ఏప్రిల్ నెలలో కాకినాడ మెయిన్‌రోడ్డులో కోటయ్య స్వీట్‌స్టాల్ పక్కన దాతల సహకారంతో స్వచ్ఛంద సంస్థ పేరుతో చలివేంద్రాన్ని ఏర్పాటు చేశాడు. ఆ వేసవిలో రెండునెలలపాటు ఆయన మజ్జిగ, మంచి నీరు, నిమ్మరసం ప్రయాణికులకు పంపిణీ చేశారు. ఇక 2001 నుంచి 2016 వరకు కాకినాడ మెయిన్‌రోడ్డుతోపాటు జీజీహెచ్ వెలుపల వరకు చలివేంద్రం నిర్వహించారు. 2017 నుంచి రమణయ్యపేట ఏపీఐఐసీ కాలనీ కనకదుర్గాదేవి ఆలయం వద్ద మెయిన్‌రోడ్డులో చలివేంద్రం నిర్వహిస్తున్నారు. ఏడాది పొడవునా చలివేంద్రం నిర్వహిస్తుండడం విశేషం. దీనికి నెలకు రూ.6 వేలు వెచ్చిస్తారు. కాకినాడ-పిఠాపురం మార్గంలో వెళ్లేవారు ఇక్కడ మంచినీరు తాగి దాహార్తిని తీర్చుకుంటున్నారు. వేసవిలో మాత్రం మజ్జిగ సరఫరా చేస్తున్నారు. ఆయన సేవలకు గుర్తింపుగా ఇటీవల మంత్రి కందుల దుర్గేష్ నుంచి ఉగాది నంది పురస్కారం అవార్డు అందుకున్నారు. ఆంజనేయరెడ్డి 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల నుంచి సిటీకి పనుల నిమిత్తం వచ్చినవారు వేసవిలో తాగునీటి కోసం పడుతున్న ఇబ్బందిని గుర్తించి తొలుత స్నేహితుల ప్రోత్సాహంతో చలివేంద్రం ఏర్పాటుచేశానని, తర్వాత నుంచి తన పేరుతో స్వచ్ఛంద సంస్థ ఏర్పాటు చేసి చలివేంద్రం నిర్వహిస్తున్నట్టు చెప్పారు.

- సర్పవరం జంక్షన్/ఆంధ్రజ్యోతి

అమ్మానాన్నలకు ప్రేమతో.. ఓ ఆటోడ్రైవర్!

కరపలో నాలుగేళ్లుగా చలివేంద్రం.. తల్లిదండ్రుల జ్ఞాపకార్థంగా నిర్వహణ

వేసవికాలంలో చలివేంద్రాలను ఏర్పాటు చేసి ప్రజల దాహార్తిని తీర్చడం చూస్తుంటాం. దాతల సహకారంతో కొన్నిరోజులు లేదా నెలల పాటు అవి నడుస్తుంటాయి. కాకినాడ జిల్లా కరప మండలం కరప గ్రామానికి చెందిన ఆటోడ్రైవర్ చోడపునీడి శ్రీను (నూతన్) నాలుగేళ్లుగా స్థానిక బజార్‌సెంటర్‌లో చలివేంద్రాన్ని నిర్వహిస్తూ ప్రయాణికుల దాహార్తిని తీరుస్తున్నాడు. సాధారణ మధ్యతరగతి కుటుంబానికి చెందిన శ్రీను ఆటో నడుపుకుంటూ నిర్విరామంగా చలివేంద్రాన్ని కొనసాగిస్తూ పలువురికి ఆదర్శంగా నిలుస్తున్నారు. తన తల్లిదండ్రులు చోడపునీడి సత్తిరాజు, సత్యవతిల జ్ఞాపకార్థం కరప బజార్‌సెంటర్‌లో నాలుగేళ్లుగా ఈ చలివేంద్రాన్ని కొనసాగిస్తున్నానని, గత ఉగాది నుంచి కరప-పెనుగుదురు ప్రధాన రహదారిలో మరో చలివేంద్రాన్ని కూడా ఏర్పాటు చేశామని శ్రీను తెలిపారు. తనకెంతో సంపాదించి ఇచ్చిన తల్లిదండ్రులకు ఏమీ చేయలేకపోయానని, కనీసం వారి పేరున చలివేంద్రాలను పెట్టి కొంతైనా వారి రుణం తీర్చుకోవాలనేది అభిమతమని చెప్పారు. **- కరప/ఆంధ్రజ్యోతి**



కరప బజారు సెంటర్‌లో నిర్వహిస్తున్న చలివేంద్రం







అర్తమూరుకు చెందిన యువతికి పెళ్లికోసం సామగ్రి అందిస్తున్న జంబయ్య.. అగ్నిప్రమాదంలో సర్వం పోగొట్టుకున్న కుటుంబానికి ఆర్థిక సాయాన్ని అందిస్తున్న దృశ్యం.. తాపేశ్వరం-రామవరం పంటకాల్వపై జంబయ్య తన సొంత నిధులతో నిర్మించిన కాలిబాట వంతెన

సామాన్యుడు... దాతృత్వంలో సంపన్నుడు!

సేవా కార్యక్రమాలకు ముందుంటున్న ఉప సర్పంచ్ కర్రి జంబయ్య



గ్రామంలో వృద్ధ దంపతులకు ఇంటిని నిర్మించిన జంబయ్య

అతడో సామాన్యుడు.. కానీ ఆపన్నహస్తం అందించడంలో మనసున్న వ్యక్తి.. తన సంపాదనలో కొంత సమాజానికి కేటాయించాలన్న తలంపుతో సేవా కార్యక్రమాలు చేస్తూ ఆదర్శంగా నిలుస్తున్నాడు. మండపేట మండలం అర్తమూరు గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు, గ్రామ ఉపసర్పంచ్ కర్రి సత్యనారాయణరెడ్డి(జంబయ్య) తన సొంత నిధులతో గ్రామంలో నూతనంగా నిర్మించిన షిర్డిసాయిబాబా ఆలయంలో పాలరాతి విగ్రహాన్ని అందించారు. తాపేశ్వరం నుంచి రామవరం వెళ్లే పంటకాల్వపై జంబయ్య తన సొంతనిధులు రూ.1.5లక్షలతో కాలిబాట వంతెన నిర్మించి ప్రజలు కష్టాలు తీర్చారు. గ్రామంలో అగ్ని ప్రమాదంలో సర్వం కోల్పోయిన చిరువ్యాపారికి తన వంతుగా రూ.50 వేలు సాయం అందించి దాతృత్వం చూపారు. నిరుపేద యువతికి పెళ్లికి అవసరమైన సారె, నగదును అందించి ఉదారతను చాటుకున్నారు. ఉన్నతవిద్య చదువుకోలేని నిరుపేద విద్యార్థులకు తనవంతు సాయం అందిస్తున్నారు. అలాగే అనేక ఆధ్యాత్మిక కార్యక్రమాలు, సేవా కార్యక్రమాల్లో ఆయన ముందు వరుసలో ఉంటున్నారు. గ్రామానికి చెందిన వృద్ధ దంపతుల ఇల్లు శిథిలావస్థకు చేరి వారిని చూసేవారు లేకపోవడంతో ఆయన తన సొంత నిధులతో వారికి ఇల్లు నిర్మించి వారి పట్ల తన ప్రేమను చాటుకున్నారు. కులమతాలకు అతీతంగా పేదల కష్టం తన కష్టంగా భావించే ఆయన ఉప సర్పంచ్‌గా, గ్రామంలో కనకదుర్గ ఆలయ కమిటీ ఛైర్మన్‌గా సేవలందిస్తున్నారు.

- మండపేట/ఆంధ్రజ్యోతి



నిత్యావసర వస్తువులు అందజేస్తున్న వలంటీర్లు





పథకం ప్రారంభం సందర్భంగా నిత్యావసర వస్తువులు అందచేస్తున్న పోలిశెట్టి శేఖర్

ఆపదలో ఆసరాగా..

'డొక్కాసీతమ్మ ఆసరా' పేరుతో సేవలందిస్తున్న జనసేన రామచంద్రపురం ఇన్‌చార్జి పోలిశెట్టి చంద్రశేఖర్

ఆపదలో ఆదుకునేవారు అరుదుగా కనిపిస్తారు.. అలాంటి సమయంలో పేద దళిత కుటుంబాలను ఆదుకోవాలనుకున్నారు జనసేన రామచంద్రపురం నియోజకవర్గ ఇన్‌చార్జి పోలిశెట్టి చంద్రశేఖర్.. కుటుంబ సభ్యులు మరణించిన ఎస్సీ, ఎస్టీ కుటుంబాలకు నెలరోజులకు సరిపడా నిత్యావసరాలు అందిస్తూ నిరుపమానసేవకు శ్రీకారం చుట్టారు.. దానికి డొక్కాసీతమ్మ ఆసరా పథకంగా నామకరణం చేశారు.. తన తల్లి, తండ్రి పేరుతో పోలిశెట్టి లక్ష్మీసుబ్బారావు మెమోరియల్ చారిటబుల్ ఫౌండేషన్ ఏర్పాటు చేసి ఈ పథకాన్ని 2023, జనవరి 1న ప్రారంభించారు. రామచంద్రపురం నియోజకవర్గంలో కాజులూరు, కె.గంగవరం, రామచంద్రపురం పట్టణం, మండలంలో ఎస్సీ, ఎస్టీ కుటుంబాల్లో ఐదేళ్ల వయస్సు పైబడి ఎవరు మరణించినా వారి కుటుంబానికి నెలరోజులకు సరిపడా 26 కిలోల బియ్యం, కందిపప్పునూనె, పంచదార, మినపప్పు, పెసరపప్పు, టీపొడి, ఇడ్లీరవ్వ, కరాచీ రవ్వ, మసాలా దినుసులతో 10 రకాల కిరాణా సరుకులు, 10 కిలోల కూరగాయలు అందజేస్తున్నారు. ఎస్సీ, ఎస్టీ కుటుంబాల్లో మరణించిన వారి కుటుంబాల వివరాలు వలంటీర్ల ద్వారా సేకరిస్తారు. ప్రతి బుధవారం కుటుంబాన్ని పరామర్శించి నిత్యావసర సరుకులు అందజేస్తున్నారు. ఇప్పటి వరకు రామచంద్రపురం నియోజకవర్గంలో 1400 కుటుంబాలకు నిత్యావసర సరుకులు అందజేశారు. ఈ పథకానికి నియోజకవర్గ ట్రస్టు కోఆర్డినేటర్‌గా తోటపేట శివారు గాంధీనగర్‌కు చెందిన గుబ్బల శ్రీనివాసరావు పనిచేస్తున్నారు. పోలిశెట్టి లక్ష్మీ సుబ్బారావు మెమోరియల్ చారిటబుల్ ఫౌండేషన్ చైర్మన్ పోలిశెట్టి చంద్రశేఖర్ మాట్లాడుతూ తన తల్లి పోలిశెట్టి లక్ష్మీకాంతానికి ఆకలిగా ఉన్నవారిని ఆదుకోవడం, తండ్రి సుబ్బారావుకు కష్టపడే తత్వం ఉండేదన్నారు. వారి ప్రభావంతోపాటు అభిమాన నటులు చిరంజీవి, పవన్‌కల్యాణ్ సేవలు స్ఫూర్తిగా నిలిచాయని, కొంతైనా పేదలకు సాయం చేయాలని నిత్యావసరాలు అందజేస్తున్నట్టు చెప్పారు. తన సోదరుడు ఫౌండేషన్ వైస్‌చైర్మన్ పోలిశెట్టి శ్రీనివాసరావు, కుటుంబ సభ్యులు సహకారం అందిస్తున్నారన్నారు. **- ద్రాక్షారామ/ఆంధ్రజ్యోతి**



సెట్ కోడ్ విడుదల చేస్తున్న ఏపీఈఏపీసెట్ చైర్మన్, ఉప కులపతి సీఎస్ఆర్కే ప్రసాద్

ఏపీఈఏపీసెట్ ప్రారంభం

ఉమ్మడి 'తూర్పు'లో తొలి రోజు 9 కేంద్రాల్లో రెండు సెషన్లలో నిర్వహణ

92.03 శాతం హాజరు నమోదు: చైర్మన్ ప్రసాద్, కన్వీనర్ సుబ్బారావు వెల్లడి

జేఎన్టీయూకే, మే 19 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జేఎన్టీయూ ఆధ్వర్యంలో ఏపీఈఏపీసెట్ సోమవారం ప్రారంభమైంది. తొలి రోజు అగ్రికల్చర్, ఫార్మసీ పరీక్ష కాకినాడ, తూర్పు గోదావరి, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాల్లో ప్రశాంతంగా జరిగిందని ఏపీఈఏపీసెట్ చైర్మన్, జేఎన్టీయూకే ఉప కులపతి సీఎస్ఆర్కే ప్రసాద్ తెలిపారు. కన్వీనర్ వీవీ సుబ్బారావు, సహ కన్వీనర్లు, కో-ఆర్డినేటర్లు, టీసీఎస్, ఏపీ ఆన్‌లైన్ అధికారులతో కలిసి వీసీ ప్రసాద్ అగ్రికల్చర్, ఫార్మసీ పరీక్ష సెట్ కోడ్‌ను వర్సిటీలోని ఈఏపీసెట్ కార్యాలయంలో విడుదల చేశారు. అనంతరం పరీక్ష నిర్వహణ తీరును పరిశీలించారు. మూడు జిల్లాల్లోని 9 కేంద్రాల్లో రెండు సెషన్లలో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, మధ్యాహ్నం 2 నుంచి 5 గంటల వరకు ఆన్‌లైన్‌లో పరీక్ష నిర్వహించారు.

● కాకినాడ జిల్లాలోని ఐదు కేంద్రాల్లో ఉదయం నిర్వహించిన పరీక్షకు 922 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా 844 మంది హాజరు కాగా 78 మంది గైర్హాజరయ్యారు. మధ్యాహ్నం అగ్రికల్చర్, ఫార్మసీ పరీక్షకు 923 మంది విద్యార్థులకు 869 మంది హాజరు కాగా 54 మంది పరీక్ష రాయలేదు. మొత్తం రెండు సెషన్లకు కలిపి 1,845 మందికి 1,713 మంది హాజరు కాగా 132 మంది గైర్హాజరయ్యారు. 92.85 శాతం హాజరు నమోదైంది.

● తూర్పు గోదావరి జిల్లాలోని రెండు కేంద్రాల్లో రెండు సెషన్లకు కలిపి మొత్తం 1,300 మంది అగ్రికల్చర్, ఫార్మసీ పరీక్షకు హాజరుకావాల్సి ఉండగా 1,204 మంది హాజరుకాగా 96 మంది గైర్హాజరయ్యారు. 92.65 శాతం నమోదైంది.

● డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలోని రెండు కేంద్రాల్లో రెండు సెషన్లలో నిర్వహించిన అగ్రికల్చర్, ఫార్మసీ పరీక్షకు 803 మంది విద్యార్థులకు 759 మంది హాజరయ్యారు. 44 మంది పరీక్ష రాయలేదని తెలిపారు. 94.52 శాతం హాజరు నమోదైంది. మంగళవారం కూడా అగ్రికల్చర్, ఫార్మసీ పరీక్షలు జరుగుతాయని కన్వీనర్ వీవీ సుబ్బారావు తెలిపారు.



ఈవోకు బంగారు పంచపాత్రలు, వెండి పళ్లెం సమర్పిస్తున్న దాతలు

వాడపల్లి వెంకన్నకు రూ.22 లక్షల విలువైన బంగారు వస్తువుల సమర్పణ

ఆత్రేయపురం, మే 19 (ఆంధ్రజ్యోతి): కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీవేంకటేశ్వరస్వామికి దాతలు రూ..22 లక్షలు విలువైన బంగారు వస్తువులను సమర్పించారు. కొత్తపేట మాజీ ఎమ్మెల్యే మంతెన సుబ్బరాజు వంశవారసులు వెంకటకృష్ణంరాజు-దుర్గావతి దంపతుల కుమారుడు వెంకటసూర్యసుబ్బరాజు-శ్వేత దంపతులు స్వామివారికి 209.84 గ్రాములతో బంగారు పంచపాత్రలు, 318.84 గ్రాములతో వెండి పళ్లెం చేయించారు. సోమవారం వాటిని ఉప కమిషనరు, ఈవో నల్లం సూర్యచక్రధరరావుకు అందచేశారు. సంప్రోక్షణ అనంతరం స్వామివారి సేవకు వినియోగించారు. దాతలకు ఆలయ మర్యాదలతో ఘన స్వాగతం పలికి వేదపండితులు ఆశీర్వచనం ఇచ్చారు. స్వామి వారి చిత్రపటం, తీర్థప్రసాదాలు దాత కుటుంబ సభ్యులకు అందజేశారు.





సాధించిన బంగారు పతకాన్ని కాకినాడ జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్‌కు చూపిస్తున్న లోవరాజు

ఉషు జాతీయ స్థాయి పోటీలకు

లోవరాజు ఎంపిక

కరప, మే 19 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా కరప మండలం జి.బావారం గ్రామానికి చెందిన యు.లోవరాజు జాతీయ స్థాయి ఉషు పోటీలకు ఎంపికైనట్టు ఉషు క్రీడ జిల్లా కార్యదర్శి ఆర్.సుందరం తెలిపారు. కర్నూలు జిల్లాలో ఈ నెల 12 నుంచి మూడు రోజుల పాటు జరిగిన 12వ రాష్ట్ర ఉషు చాంపియన్ షిప్ సీనియర్స్ విభాగంలో లోవరాజు 80 కేజీల విభాగంలో బంగారు పతకం సాధించాడు. ప్రతిభ కనబరిచిన అతడు త్వరలో జరిగే జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. ఈ సందర్భంగా లోవరాజు సోమవారం కలెక్టర్ షాన్‌మోహన్‌ను మర్యాదపూర్వకంగా కలిసి బంగారు పతకం చూపించగా ఆయన అభినందించారు. జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన లోవరాజును జిల్లా క్రీడాభివృద్ధి అధికారి ఆఫీసర్ బి.శ్రీనువాసకుమార్, రాష్ట్ర ఉషు కార్యదర్శి బి.నరసింహరావు, జి.బావారం సర్పంచ్ రొక్కాల గణేష్, ఉప సర్పంచ్ వై.రామకృష్ణ, యండమూరు స్కూల్ కమిటీ చైర్మన్ పి.శ్రీనివాస్ అభినందించారు.

22న హనుమాన్ శోభాయాత్ర బైక్ ర్యాలీ

సామర్లకోట, మే 19 (ఆంధ్రజ్యోతి): హనుమాన్ శోభాయాత్ర కమిటీ సామర్లకోట-పెద్దాపురం పట్టణ శాఖల ఆధ్వర్యంలో ఈ నెల 22న హనుమాన్ శోభాయాత్ర పేరిట భారీ బైక్ ర్యాలీ నిర్వహించనున్నట్టు శోభాయాత్ర కమిటీ ప్రతినిధులు తెలిపారు. ఆ రోజు సాయంత్రం నాలుగు గంటలకు సామర్లకోట ప్రసన్నాంజనేయస్వామి విగ్రహం వద్ద ప్రారంభమయ్యే ర్యాలీ సామర్లకోట, పెద్దాపురం వీధుల్లో కొనసాగుతుంది. శృంగవృక్షం దత్త పీఠాధిపతి శ్రీసాయిదత్త నాగానంద సరస్వతి స్వామీజీ ముఖ్య అతిథిగా హాజరై భక్తులకు అనుగ్రహభాషణ చేస్తారన్నారు.

నాడు...



ఆపద తొలగింది!

కాకినాడలోని కొండయ్యపాలెం బ్రిడ్జి వద్ద అపార్ట్‌మెంట్ల సమీపంలో విద్యుత్ స్తంభానికి ఓ మొక్క పాదులా అల్లుకుంది. దీంతో విద్యుత్ ప్రమాదం పొంచి ఉందంటూ ఈ నెల 10న 'ఆంధ్రజ్యోతి'లో చిత్రం వచ్చింది. దీనికి అధికారులు స్పందించి సోమవారం ఆ మొక్కను తొలగించారు.

- ఫొటోగ్రాఫర్, కాకినాడ

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

నేడు...





కాకినాడ డీఆర్వో వెంకట్రావుకు వినతిపత్రం ఇస్తున్న వెంకటరామానాయుడు-సత్యవతి దంపతులు

'కబ్జాదారుల చెర నుంచి మా స్థలాలను విడిపించండి'

కాకినాడ/కలెక్టరేట్, మే 19 (ఆంధ్రజ్యోతి): కాకినాడ గైగోలుపాడులోని తమ స్థలాలను వైసీపీ నాయకులు కబ్జా చేశారని, వారి చెర నుంచి విడిపించాలని ఎయిర్‌ఫోర్స్ విశ్రాంత ఉద్యోగి, తూర్పు గోదావరి జిల్లా దివాన్ చెరువుకు చెందిన కొత్తపల్లి వెంకటరామానాయుడు-సత్యవతి దంపతులు కాకినాడ జిల్లా కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో విన్నవించారు. తాను ఉద్యోగంలో ఉండగా 350 గజాల చొప్పున కొనుగోలు చేసిన రెండు స్థలాలు ఆక్రమణకు గురవ్వడంపై డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, మంత్రి నారా లోకేశ్, కాకినాడ రూరల్, సిటీ ఎమ్మెల్యేలు పంతం నానాజీ, వనమాడి వెంకటేశ్వరరావులను కలిసి వివరించామన్నారు. సోమవారం కాకినాడ ఎస్పీ బిందుమాధవ్‌తో పాటు కలెక్టరేట్‌లో రెవెన్యూ అధికారి వెంకట్రావుకు వినతిపత్రాలు అందజేశామని వివరించారు. కాగా ఈ వ్యవహారంపై కలెక్టర్ షాన్‌మోహన్ స్పందించి విచారణకు ఆదేశించారు. కబ్జాకు గురైన స్థలాన్ని కాకినాడ ఆర్డీవో మల్లిబాబు, కాకినాడ అర్బన్ తహసీల్దార్ జితేంద్ర సోమవారం రాత్రి పరిశీలించారు.

వచ్చేస్తోంది.. మరో హై..వే!

- ఖమ్మం నుంచి దేవరపల్లి ఎన్‌హెచ్‌-365 బీజీ
- జూన్ నాటికి పూర్తిచేయాలని ప్లాన్
- ఇప్పటికే దేవరపల్లి వద్ద టోల్‌ప్లాజా సిద్ధం
- పాంగుటూరు వద్ద 11 హెక్టార్ల భూ సమస్య
- దగ్గర దారికి కోర్టు అడ్డంకి
- 3 కి.మీ మేర ఆగిన పనులు
- ఆగస్టు 15న ప్రారంభించే ఆలోచన


దేవరపల్లి వద్ద సిద్ధం చేసిన టోల్‌ప్లాజా

(రాజమహేంద్రవరం- ఆంధ్రజ్యోతి)

మరో కొత్త జాతీయ రహదారి వస్తోంది.. కేవలం ప్రారంభానికి మూడు కిలోమీటర్ల దూరంలోనే ఉంది. అయితే చిన్న సమస్య కారణంగా నేటికీ ఆరంభానికి నోచుకోలేదు.. ఆ సమస్య పరిష్కారమైతే విజయవాడ వెళ్లినంత ఈజీగా హైదరాబాద్‌కు వెళ్లవచ్చు. ఖమ్మం నుంచి దేవరపల్లి మండలంలోని దేచర్ల వరకూ భారత మాల ఆర్థిక నడవా పథకం కింద నాలుగు వరుసల జాతీయ రహదారి(ఎన్‌హెచ్‌)- 365జీబీ పేరుతో ఓ గ్రీన్‌మార్గం నిర్మాణం అవుతోంది. రహదారి పనులు చాలా వేగంగా జరుగుతున్నాయి. జూన్ నాటికి ఇది పూర్తవుతాయని అధికారులు చెబుతున్నారు. ఆగస్టులో ఈ జాతీయ రహదారిని జాతికి అంకితం చేయాలనే ఆలోచనతో ఉన్నారు. ఇంత పెద్ద జాతీయ రహదారికి కేవలం మూడు కిలోమీటర్ల మేర 11 హెక్టార్ల భూ సేకరణ వివాదంగా మారింది. సదరు భూయజమానులు కోర్టును ఆశ్రయిం చడంతో అక్కడ వివాదం కొనసాగుతోంది. ఈ మూడు కిలోమీటర్ల మేర తప్ప మిగతా హైవే నిర్మాణం సుమారుగా పూర్తయినట్టే. హైదరాబాద్ నుంచి విశాఖ, కలకత్తా వైపు వెళ్లేవారు విజయవాడ మీదగా వెళ్లాలంటే 670 కిలోమీటర్లు హైవేలో 12 గంటల ప్రయాణించాల్సి వస్తుంది. చాలా మంది ఖమ్మం మీదగా కొవ్వూరు- రాజమహేంద్రవరం ఫోర్త్ బ్రిడ్జి మీదగా దగ్గర దారి కోసం పయనిస్తూ ఉంటారు. ప్రస్తుతం గుండుగొలను, నల్లజర్ల, కొవ్వూరు మీదుగా వెళ్లడం వల్ల కొంత దూరం తగ్గింది. ఖమ్మం నుంచి రావడం వల్ల మరింత దూరం తగ్గుతుంది. కేవలం 550 కిలోమీటర్ల మేర పయనిస్తే ఎనిమిది గంటల్లో హైదరాబాద్ చేరుకోవచ్చు.దీనికోసం ఖమ్మం నుంచి దేవరపల్లి మండలంలోని దేచర్ల వరకూ 165 కిలోమీటర్ల మేర నాలుగు వరుసల జాతీయ రహదారిని భారతమాల ఆర్థిక నడవా పథకం కింద ఎన్‌హెచ్ -365జీబీ పేరుతో నిర్మిస్తున్నారు. దీనివల్ల హైదరాబాద్ విశాఖపట్నం మధ్య 120 కిలోమీటర్ల దూరం తగ్గిపోతుంది. సుమారు రూ.3,573 కోట్ల ఖర్చుతో 165 కిలోమీటర్ల మేర దీనిని నిర్మిస్తున్నారు. తెలంగాణ, ఆంధ్ర రాష్ట్రాల్లో ఐదు ప్రాజెక్టుల కింద పనిజరుగుతుంది. 117 అండర్ పాసులు, 33 కల్వర్టులు, 9 భారీ వంతెనలు నిర్మాణం వేగంగా జరుగుతున్నాయి. దేవరపల్లి వద్ద టోల్‌ప్లాజా కూడా ఏర్పాటు చేశారు. ఖమ్మం నుంచి దేవరపల్లి వరకూ కేవలం కొయ్యలగూడెం పరిధిలోని పొంగుటూరులో మూడు కిలోమీటర్ల మేర తప్ప, మిగతా హైవే అంతా సుమారుగా పూర్తయిపోయింది.

కోర్టు సమస్య త్వరగా పరిష్కరించాలి..

మంచి పనులకు కూడా కొన్ని సమస్యలు వస్తుంటాయి. అలాంటపుడు ప్రభుత్వం, అధికారులు సీరియస్‌గా తీసుకుని వాటిని పరిష్కరించి ముందుకు సాగాలి. ప్రజాప్రతినిధులు కూడా స్థానికంగా ఇటువంటి సమస్యలు పరిష్కరించడంపై దృష్టిపెట్టాలి. కొయ్యలగూడెం సమీపంలోని పొంగుటూరుప్రాంతంలో మూడు కిలోమీటర్ల మేర 11 హెక్టార్ల భూ సేకరణ సమస్య కోర్టులో ఉంది. కోర్టు తీర్పు రిజర్వులో ఉన్నట్టు అధికారుల కథనం. ఈ తీర్పు వెలువడితేనే ఈ మూడు కిలోమీటర్ల మేర హైవే పనులు ఆరంభమ వుతాయి. ఆగస్టు 15లోపు పూర్తి చేయాలనే ఆలోచనతో ఉన్నా అది సాధ్యపడేదిగా కనిపించడంలేదు. కోర్టు అనుమతి ఇవ్వాలి. భూసేకరణ ప్రక్రియ పూర్తికావాలి. పనులు చేపట్టాలి. మూడు కిలోమీటర్ల మేర నాలుగు వరసల హైవే నిర్మాణం అంటే కొంత సమయం పడుతుంది. ఇక ఆగస్టు అంటే కేవలం మూడునెలలు మాత్రమే సమయం ఉంది. కాని యంత్రాంగం ఈ పనులు త్వరగా పూర్తి చేసేలా ప్రయత్నం చేయవలసిందే. మూడు కిలోమీటర్ల మేర ఏర్పడిన సమస్యను యుద్ధ ప్రాతిపదికను పూర్తి చేయాలని ప్రజలు కోరుతున్నారు.

ఇండియన్ ఫారెస్టు సర్వీస్‌కు లవకుమార్ ఎంపిక



రౌతులపూడి, మే 19 (ఆంధ్రజ్యోతి): రౌతులపూడి మండలం మూలగపూడి గ్రామానికి చెందిన చింతకాయల లవకుమార్ ఇండియన్ ఫారెస్టు సర్వీస్‌కు ఎంపికయ్యాడు. ఆల్ ఇండియాలో 49 ర్యాంకు సాధించాడు. పశువైద్యుడిగా పనిచేస్తూ మొదటిసారి సివిల్స్ పరీక్షలు రాసి విఫలం కాగా, రెండో ప్రయత్నం 2024లో పరీక్షకు హాజరై విజయం సాధించాడు. చింతకాయల వీర చక్రవర్తి, వీరవరహాలు దంపతులకు ఒక అమ్మాయి, ఒక అబ్బాయి. ఈయన తల్లిదండ్రులు వ్యవసాయం చేస్తుం టారు. లవకుమార్ పశువైద్యుడిగా పనిచేస్తూ నర్సీపట్నంలో నివాసముంటున్నాడు. ఎటువంటి కోచింగ్ లేకుండానే విజయం సాధించినట్టు ఆయన తెలిపాడు. ఈ సందర్భంగా లవకుమార్‌ను ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ, తదితరులు అభినందించారు.

చికిత్స పొందుతూ ...

టీడీపీ నేత సుబ్రహ్మణ్యం మృతి

- సంతాపం తెలిపిన పిఠాపురం మాజీ ఎమ్మెల్యే ఎస్వీఎస్ఎన్ వర్మ


సుబ్రహ్మణ్యం మృతదేహంపై టీడీపీ జెండా కప్పుతున్న మాజీ ఎమ్మెల్యే వర్మ



పిఠాపురం రూరల్, మే 19 (ఆంధ్రజ్యోతి): రోడ్డుప్రమాదంలో తీవ్రంగా గాయపడిన కాకినాడ జిల్లా పిఠాపురం మండలం మల్లాం అంబేడ్కర్ యువజన సంఘం అధ్యక్షుడు, టీడీపీ నేత ఎద్దు సుబ్రహ్మణ్యం (35) ఆసుపత్రిలో చికిత్స పొందుతూ సోమవారం మృతిచెందాడు. ఈనెల 16వ తేదీ రాత్రి తన బైక్‌పై సుబ్రహ్మణ్యం ఇంటికి వస్తుండగా జల్లూరు సమీపంలో అదుపు తప్పి తీవ్రగాయాలపాలైనట్టు పోలీసులు చెబుతున్నారు. దీంతో అతడిని చికిత్స నిమిత్తం కాకినాడలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించగా, అక్కడ చికిత్స పొందుతూ మరణించాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. పిఠాపురం రూరల్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. ఇతనికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఈయన మృతిపై పిఠాపురం మాజీ ఎమ్మెల్యే ఎస్వీఎస్ఎన్ వర్మ సంతాపం ప్రకటించి, పార్థివదేహంపై టీడీపీ జెండాను కప్పారు.

గోదావరిలో స్నానానికి దిగి యువకుడి మృతి


గాడి రాకేష్ మృతదేహం

కొవ్వూరు, మే 19 (ఆంధ్రజ్యోతి): గోదావరిలో స్నానానికి వెళ్లి యువకుడు మృతి చెందిన సంఘటన కొవ్వూరు మండలం సీతంపేటలో సోమవారం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్లితే చాగల్లు మండలం దారవరం గ్రామానికి చెందిన గాడి రాకేష్ (17) తన స్నేహితుడితో కలిసి గోదావరిలో స్నానానికి వెళ్లాడు. అయితే నది లోతు ఎక్కువగా ఉండడంతో ప్రమాదవశాత్తు అందులో మునిగిపోయాడు. తర్వాత తేలడంతో నిడదవోలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అప్పటికే మృతిచెందినట్టు వైద్యులు ధృవీకరించారు. ఆసుపత్రి సమాచారం మేరకు కొవ్వూరు రూరల్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ శ్రీహరిరావు తెలిపారు.

దిక్కుతోచని స్థితిలో...

వైట్‌బర్లీ పొగాకు రైతులు

- కొనేవారు లేక ఎదురుచూపు
- మొహం చాటేసిన కంపెనీ అధికారులు


భీమోలులో పంటను చూపుతున్న రైతులు

గోపాలపురం, మే19(ఆంధ్రజ్యోతి): గోపాలపురం మండలంలో వైట్‌బర్లీ పొగాకు రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. కొనుగోలుదారుల మాయలోపడి భీమోలు, కరగపాడులో దాదాపు 100 ఎకరాల్లో పంటను సాగుచేశారు. నాట్లు దశలో కొనుగోలు చేస్తామని కంపెనీ ప్రతినిధులు నమ్మబలికారు. అంతేకాకుండా సాగుకు అవసరమయ్యే మందులను కూడా సరఫరా చేశారు.తీరా పంటపూర్తై చేతికి అందివచ్చే తరుణంలో మాట మార్చి కొనుగోలు చేసేందుకు నిరాకరించారు. దీంతో వారంతా దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. అధిక మొత్తం పెట్టుబడి పెట్టగా, ప్రస్తుతం కొనేవారులేక అయోమయంలో పడ్డారు. నాట్లుదశలో కిలో రూ.150కి కొనుగోలు చేస్తామని చెప్పి, ఇప్పుడేమో నాణ్యతను బట్టి రూ. 120-150కి కొనుగోలు చేస్తామని చెబుతుండడంతో రైతులు కంగుతిన్నారు. దీంతో భీమోలులోని రైతులు నిరసన వ్యక్తం చేశారు.

వ్యభిచార గృహంపై దాడి

- పోలీసుల అదుపులో ఇద్దరు మగవాళ్లు , ముగ్గురు మహిళలు


వివరాలు వెల్లడిస్తున్న దేవరపల్లి సీఐ నాగేశ్వర్ నాయక్

దేవరపల్లి, మే 19(ఆంధ్రజ్యోతి): వ్యభిచార గృహంపై దాడి చేసి ఇద్దరు మగ, ముగ్గురు మహిళలను అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి ఫోన్లు, మారుతి బ్రిడ్జ్ కారును స్వాధీనం చేసుకున్నట్టు దేవరపల్లి సీఐ బీ.నాగేశ్వర్‌నాయక్ పేర్కొన్నారు. దేవరపల్లి సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కార్యాలయంలో సోమవారం ఆయన విలేకరులకు వివరాలు వెల్లడిస్తూ... దేవరపల్లిలోని మారుతీనగర్‌లో పెనుగొండ జోగేశ్వరరావు అనే వ్యక్తి ఇంటిలో వ్యభిచారం జరుగుతుందన్న ముందస్తు సమాచారం మేరకు తాను, ఎస్సై వీ.సుబ్రహ్మణ్యం, సిబ్బంది, వీఆర్వోలను తీసుకుని వెళ్లి సోదాలు నిర్వహించగా, ఇద్దరు మగ, ముగ్గురు మహిళలు ఉన్నట్టు గుర్తించామన్నారు. ఈ క్రమంలో వారిని అదుపులోకి తీసుకుని విచారించగా గత కొంతకాలంగా గోపాలపురం మండలం చిట్యాలకి చెందిన జుట్టా బేబీ, దుద్దుకూరుకి చెందిన సిర్రా రవి మహిళలకు వల వేసి వారిని వ్యభిచార కూపంలోకి దింపుతూ, దాంతో వచ్చిన సంపాదనతో విలాసవంతంగా గడుపుతున్నారన్నారు. ఈ కేసులో వ్యభిచార కేంద్రం నిర్వహిస్తున్న బేబీ, రవి, విటుడు ఏలూరుకు చెందిన కొళ్ల రవితేజను వ్యభిచారం నేరం కింద అరెస్టు చేసి జ్యూడిషియల్ రిమాండ్‌కు పంపుతున్నట్టు చెప్పారు. అలాగే వ్యభిచార గృహంలో దొరికిన ఇద్దరు బాధిత మహిళలను ఏపీ స్టేట్ హోమ్‌కు పంపించేందుకు కోర్టు అనుమతి కోరుతున్నామని సీఐ పేర్కొన్నారు.

భార్యను వేధిస్తున్న భర్తపై కేసు

ఆత్రేయపురం, మే 19(ఆంధ్రజ్యోతి): భార్యను వేధిస్తున్న భర్తపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఆత్రేయపురం ఎస్ఐ ఎస్.రాము తెలిపారు. వాడపల్లికి చెందిన పెద్దింటి అనురాధకు అదే గ్రామానికి చెందిన సుబ్రహ్మణ్యంతో 17ఏళ్ల క్రితం వివాహమైంది. వారికి ఇద్దరు కుమార్తెలు. కొంతకాలంగా సుబ్రహ్మణ్యం భార్యను అదనపు కట్నం తేవాలంటూ తరచూ వేధిస్తున్నాడు. ఇంటి నుంచి బయటకు గెంటివెయ్యడంతో అనురాధ పుట్టింటికి వెళ్లి కుటుంబ సభ్యుల సహకారంతో సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఆమె ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ రాము తెలిపారు.

పిఠాపురంలో ఇరువర్గాల ఘర్షణ

ఆరుగురికి తీవ్ర గాయాలు.. ఆసుపత్రికి తరలింపు

పిఠాపురం, మే 19 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా పిఠాపురంలో సోమవారం సాయంత్రం రెండు వర్గాల మధ్య జరిగిన ఘర్షణలో ఆరుగురికి గాయాలయ్యాయి. ఇందిరానగర్ ప్రాంతానికి చెందిన మిరియాల సూర్యకుమారి ఇంటిని ఇటీవల అధికారులు కూల్చివేశారు. ఈ విషయంపై ఇంటి ఎదురుగా ఉన్న కొల్లి సత్తిబాబు, అతడి కుటుంబసభ్యులు, సూర్యకుమారి కుటుంబసభ్యుల మధ్య వివాదం చోటుచేసుకుంది. వివాదం ముదిరి ఇరువర్గాలు పరస్పరం దాడులు చేసుకున్నారు. ఈ ఘటనలో ఒక వర్గానికి చెందిన ముగ్గురు, మరో వర్గానికి చెందిన ముగ్గురికి గాయాలయ్యాయి. వీరిని చికిత్స నిమిత్తం పిఠాపురం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పిఠాపురం పట్టణ పోలీసులు ఇరువర్గాల నుంచి స్టేట్‌మెంట్లు రికార్డు చేసుకున్నారు.

వేర్వేరు చోట్ల ఇద్దరు అదృశ్యం

రాజమహేంద్రవరం సిటీ, మే 19(ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరంలో వేర్వేరు ప్రాంతాలకు చెందిన ఇద్దరు అదృశ్యమయ్యారని పోలీసులు తెలిపారు. బొమ్మూరు పోలీసుల కథనం ప్రకారం వివరాల్లోకి వెళితే.. స్థానిక సావిత్రి నగర్‌కు చెందిన ఓ వివాహిత తన ఇద్దరు పిల్లలను తీసుకుని ఈనెల 18వ తేదీ ఉదయం 11గంటలకు ఇంటి నుంచి బయటకు వెళ్లింది. తిరిగి రాకపోవడం, బంధువుల ఇళ్ల వద్ద వెతికినా ఆచూకీ లభ్యం కాకపోవడంతో ఆమె భర్త బొమ్మూరు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి ధర్యాప్తు చేస్తున్నారు. అలాగే స్థానిక కంబాలపేటకు చెందిన ఎస్.భీమరాజు అనే మెకానిక్ నెల 16న ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. అతడి ఆచూకీ లభించకపోవడంతో భార్య ప్రియదర్శిని ఇచ్చిన ఫిర్యాదు మేరకు త్రీటౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఐబీఎంతో జీజీయూ ఎంవోయూ



ఒప్పంద పత్రాలు మార్చుకుంటున్న దృశ్యం

రాజానగరం, మే 19(ఆంధ్రజ్యోతి): గోదావరి గ్లోబల్ విశ్వవిద్యాలయం(జీజీయూ), ప్రపంచ ఐటీ దిగ్గజ సంస్థ ఐబీఎంతో అవగాహన ఒప్పందం(ఎంవోయూ)చేసుకున్నట్టు జీజీయూ ప్రోచాన్సలర్ కె.శశికిరణ్ వర్మ తెలిపారు. ఐబీఎం ఇన్నోవేషన్ సెంటర్ ఫర్ ఎడ్యుకేషన్ బిజినెస్ డెవలప్‌మెంట్ అండ్ క్లైంట్ రిలేషన్‌షిప్ లీడర్ హరిరామ సుబ్రహ్మణియన్, డెలివరీ హెడ్ వికారుద్దీన్‌తో కలిసి సోమవారం జీజీయూ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎం వోయూ కారణంగా భవిష్యత్తులో జీజీయూ, ఐబీఎం మధ్య విద్యా సహకారం అనే థీమ్ కింద అర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, మెషీన్ లెర్నింగ్ అండ్ డేటా సైన్స్ ప్రోగ్రాం ప్రారంభాన్ని సూచిస్తుందన్నారు. ఐబీఎం ఉభయ తెలుగు రాష్ట్రాల్లో జీజీయూతోనే ఎంవోయూ చేసుకుం దన్నారు. ఈ రెండూ ఉమ్మడిగా కోర్సులను అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో బోధిస్తుందని, విద్యార్థులకు ఇంటర్న్‌షిప్, లైవ్ ప్రాజెక్టు, ఉద్యోగాలు పొందే అవకాశం ఉంటుందన్నారు. దీనిలో భాగంగా జీజీయూ ఐబీఎం అధికారులు పరస్పరం ఎంవోయూ పత్రాలను మార్చుకున్నారు. సమావేశంలో జీజీయూ వైస్ ఛాన్సలర్ యు.చంద్రశేఖర్, ప్రోఛాన్సలర్ కేవీబీ రాజు, రిజిస్ట్రార్ పీఎంఎంఎస్ శర్మ, డైరెక్టర్ ఎం.శ్రీనివాసరావు, ది పర్పుల్ స్టోరీ సంస్థ వ్యవస్థాపకుడు, ఎండీ సుమంత్ పాలేపు పాల్గొన్నారు.

ఉద్యాన పరిశోధన కేంద్రం అధిపతిగా ముత్యాలనాయుడు


ముత్యాలనాయుడును కలిసిన స్థానిక శాస్త్రవేత్తలు

అంబాజీపేట, మే 19(ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడర్ కోనసీమ జిల్లా అంబాజీపేట డాక్టర్ వైఎస్సార్ ఉద్యాన పరిశోధన కేంద్రం అధిపతిగా డాక్టర్ ఎం.ముత్యాలనాయుడు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకూ పనిచేసిన అధిపతి డాక్టర్ ఎన్‌బీవీ చలపతిరావు వెంకటరామన్నగూడెం వైఎస్సార్ ఉద్యాన సమాచార కేంద్రానికి బదిలీ అయ్యారు. దీంతో కర్నూలు జిల్లా నంద్యాలలోని మహానంది ఉద్యాన పరిశోధన కేంద్రం ఉద్యాన పరిశోధన కేంద్రం నుంచి ముత్యాలనాయుడు బదిలీపై అంబాజీపేట వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు అందుబాటులో ఉంటూ పంటలలో వచ్చే సమస్యలను పరిష్కరించేందుకు కృషిచేస్తానన్నారు. కొబ్బరిని ఆశించి నష్టాన్ని కలుగ చేస్తున్న తెల్లదోమ నివారణకు చర్యలు తీసుకుంటానన్నారు. ఈ సందర్భంగా ముత్యాలనాయుడును స్థానిక శాస్త్రవేత్తలు గోవర్ధనరావు, కిరిటీ, నీరజ, అనూష, సిబ్బంది మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని వ్యక్తి మృతి




మృతుడు గంధం నాగేశ్వరరావు, ఫైల్‌ఫొటో

కొత్తపేట, మే 19(ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కొత్తపేట పాతబస్టాండ్ సెంటర్లో ఆర్టీసీ బస్సు వ్యక్తిని నేరుగా ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతిచెందిన్నట్టు ఎస్ఐ జి.సురేంద్ర తెలిపారు. వాడపాలేనికి చెందిన గంధం నాగేశ్వరరావు(37) బంధువుల ఇంట పెళ్లికి కొత్తపేట బస్టాండ్ సమీపంలో ఉన్న హరిహర దేవాలయ ప్రాంగణానికి వెళ్లాడు. ఆదివారం రాత్రి 11గంటల సమయంలో అమలాపురం నుంచి రావులపాలెం వైపు వెళ్తున్న ఆర్టీసీ బస్సు వేగంగా నాగేశ్వరరావును ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. ఈ మేరకు మృతుడు భార్య గంధం దుర్గ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ సురేంద్ర తెలిపారు. కాగా కుటుంబాన్ని పోషించే భర్త ఇలా రోడ్డు ప్రమాదంలో మృతిచెందడంతో భార్య దుర్గ విలపించిన తీరు అందర్ని కలిచివేసింది.

అనపర్తిలో ఆటోను ఢీకొన్న బైక్

ఇద్దరు యువకులకు తీవ్ర గాయాలు


ప్రమాదంలో గాయపడ్డ యువకులు

అనపర్తి, మే 19(ఆంధ్రజ్యోతి): అనపర్తిలోని కుమ్మరి వీధిలో సోమవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు తీవ్ర గాయాలపాలయ్యారు. ఎస్ఐ శ్రీను నాయక్ తెలిపిన వివరాల ప్రకారం.. అనపర్తి మండలం పీరా రామచంద్రపురం గ్రామానికి చెందిన లంక మనోహర్, కోడి ప్రదీప్ అనపర్తిలోని పాత హరిజన పేటలో తమ బంధువుల ఇంటికి మోటార్‌సైకిల్‌పై వచ్చారు. తిరుగు ప్రయాణమైన వీరు కుమ్మరి వీధిలో ఎదురుగా వస్తున్న ఆటోను ఢీకొని రోడ్డుపై పడ్డారు. ఈ ప్రమాదంలో ఇద్దరికీ తీవ్ర గాయాలయ్యాయి. వారిని స్థానికులు స్థానిక ఏరియా ఆసుపత్రికి తరలించగా అక్కడ ప్రథమ చికిత్స అందించి మెరుగైన వైద్యం కోసం కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఆసుపత్రి నుంచి వచ్చిన సమాచారం మేరకు కేసు నమోదు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

సారా తరలిస్తున్న ఇద్దరి అరెస్టు

రాజమహేంద్రవరం సిటీ, మే 19(ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరంలో సారాను తరలిస్తున్న ఇద్దరి అరెస్టు చేసినట్టు త్రీటౌన్ పోలీసులు తెలిపారు. రాజమహేంద్రవరం సంజీవయ్యనగర్ సమీపంలో సోమవారం 10లీటర్ల సారాతో వెళ్తున్న పి.జోసెఫ్‌ను, మూలగొయ్యి సమీపంలో 10లీటర్ల సారాతో వెళ్తున్న కె.ప్రసాద్‌ను త్రీటౌన్ పోలీసులు పట్టుకున్నారు. వారిని అరెస్టు చేసి 20లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నట్టు పోలీసులు తెలిపారు.

మురికిని మురుకుతోనే..

ముల్లును ముల్లుతోనే తీయాలనే నానుడి అందరికీ తెలిసే ఉంటుంది. ఇక్కడ ఉన్న ఫొటోలకు ఈ నానుడి సరిగ్గా సరిపోతుంది అనుకుంటా.. పవిత్రమైన గోదావరి నది కాలుష్యం బారిన పడుతోంది. పుణ్య స్నానాలకు వచ్చిన భక్తులు విడిచిన బట్టలు, ఇతర వ్యర్థాలతో కలుషితం అవుతోంది. అయినా పట్టించుకునే నాథుడే లేడు. ఇదిలా ఉంటే ఇక్కడ బట్టలు ఉతికే ఆవిడను చూడండి! మురికి పట్టిన బట్టలను తెచ్చి మురికి నీళ్లలో ముంచి, బండకేసి బాది, గట్టిగా పిండి ఎండలో ఆరబెట్టింది. చివరి ఫొటోను చూశారా! ఎండలో ఆరబెట్టిన బట్టలు ఎలా తలతలా మెరిసిపోతున్నాయో! ముల్లును ముల్లుతోనే తీయాలన్నట్టు.. మురికిని మురికితోనే పోగొట్టాలనుకుంటా!

-ఫొటోగ్రాఫర్, రాజమహేంద్రవరం.



రేపు పింఛన్ పత్రాల పంపిణీ
యానాం, మే19(ఆంధ్రజ్యోతి): యానాం మత్స్య శాఖ ద్వారా 278వృద్ధాప్య పింఛన్లు మంజూర య్యాయి. పింఛన్‌దారులకు మత్స్యశాఖ ద్వారా మంజూరు పత్రాలను బుధవారం ఉదయం పది గంటలకు ఇస్తున్నామని మత్స్యశాఖ సహాయ సంచాలకుడు తెలిపారు. పత్రాలు తీసుకునేందుకు పింఛన్‌దారులు రావాలని కోరారు.

ఉపాధి పనుల పరిశీలన
అంబాజీపేట, మే19(ఆంధ్రజ్యోతి): మండలంలో జరుగుతున్న జాతీయ గ్రామీణ ఉపాధి పనులను ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు సోమవారం పరిశీలించారు. నిబంధనల మేరకు పనులు చేప ట్టాలన్నారు. అధికఉష్ణోగ్రతల నేపథ్యంలో కూలీలు జాగ్రత్తలు పాటించాలన్నారు. దాతలందిస్తున్న సహకారాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు.

గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి ప్రభుత్వం కృషి

- ఆర్థిక సంఘ నిధుల బకాయిలు త్వరలో విడుదల
- టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు రెడ్డి సుబ్రహ్మణ్యం
- అంబాజీపేటలో టీడీపీ మినీ మహానాడు


మహానాడులో మాట్లాడుతున్న రెడ్డి సుబ్రహ్మణ్యం

అంబాజీపేట, మే 19(ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం కృతనిశ్చ యంతో ఉందని, గతంలో బకాయిలున్న ఆర్థిక సంఘం నిధులన్నీ త్వరలోనే విడుదలవుతా యని టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు రెడ్డి సుబ్ర హ్మణ్యం అన్నారు. అంబాజీపేట వాసవీ కన్యకా పరమేశ్వరి కల్యాణ మండపంలో టీడీపీ నియో జకవర్గ కన్వీనర్ నామన రాంబాబు అధ్యక్షతన నియోజకవర్గ మినీమహానాడు సోమవారం జరి గింది. ఈసందర్భంగా రెడ్డి సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వంలో అధోగతి పాలైన రాష్ట్రాన్ని సీఎం చంద్రబాబు, ఉపముఖ్య మంత్రి పవన్‌కల్యాణ్ ఆధ్వర్యంలో ఆదర్శ రాష్ట్రంగా తీర్చిదిద్దుతున్నారని పేర్కొన్నారు. ఈసమావేశంలో ప్రవేశపెట్టిన తీర్మానాలన్నింటి ని ఈనెల 27, 28,29తేదీల్లో కడపలో జరిగే రాష్ట్ర స్థాయి టీడీపీ మహానాడులో ప్రవేశపెడ తామన్నారు. ఈసందర్భంగా నియోజకవర్గ కోక న్వీనర్ దాసరి వీరవెంకట సత్యనారాయణ ప్రవే శపెట్టిన పలు తీర్మానాలను సమావేశం ఏకగ్రీ వంగా ఆమోదించారు. ముఖ్యంగా కార్పొరేషన్ రుణాలు విరివిగా మంజూరు చేయాలని, రైతు లకు ఎరువుల రాయితీ ఇవ్వాలని, అప్పనపల్లి కాజ్‌వే నిర్మాణం చేపట్టాలని, బ్రాహ్మణులకు రాజకీయాల్లో ప్రాధాన్యం కల్పించే విధంగా ఎమ్మెల్యే, ఎంపీ, ఎమ్మెల్సీలు కేటాయించాలని, అతిము ఖ్యంగా వైసీపీ ప్రభుత్వంలో పనిచేసిన అధికారులు నేటికి తీరు మార్చుకోవ డంలేదని అటువంటి వారిపై క్రమశిక్షణ చర్యలు చేపట్టాలన్నారు. సమావేశంలో సివిల్ సప్లై కా ర్పొరేషన్ డైరెక్టర్ మోకా ఆనందసాగర్, నియోజ కవర్గ పరిశీలకుడు షేక్ సుభాన్, రాష్ట్ర సర్పం చ్‌ల సమాఖ్య నాయకులు నాగాబత్తుల శాంత కుమారిసుబ్బారావు, శెట్టిబలిజ కార్పొరేషన్ డైరెక్టర్ బొంతు పెదబాబు, నాయకులు నేదు నూరి వీర్రాజు, గణపతి వీరరాఘవులు, చిట్టూరి శ్రీనివాస్, మొల్లేటి శ్రీనివాస్, బొప్పా ప్రతాప్, సంసాని పెద్దిరాజు, చిన్నం బాలవిజయరావు, మద్దాల సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

శిథిలావస్థలో పి.గన్నవరం ఏరియా పశువైద్యశాల

- శ్లాబ్‌కు లీకులు, అధ్వానంగా పరిసరాలు
- ఈఆసుపత్రి పరిధిలో 4పశువైద్యశాలలు
- పట్టించుకోని పాలకులు, అధికారులు



పి.గన్నవరంలో శిథిలావస్థలో ఏరియా పశువైద్యశాల, శిథిలమైన పశువైద్యశాల గోదాము

పి.గన్నవరం, మే 19(ఆంధ్రజ్యోతి): పాడిపరి శ్రమపై ప్రత్యేక దృష్టి కనబరిచి నిరంతరం పా డిపశువులకు మెరుగైన వైద్యం అందించే దిశగా కృషి చేస్తున్నామని గొప్పలు చెప్పుకున్న గత వైసీపీ ప్రభుత్వం పశువైద్య శాలలను కనీసం పట్టించుకోలేదు. దీంతో క్షేత్రస్థాయిలో పశువైద్య శాలలు నేడు అధ్వానంగా దర్శనమిస్తోన్నాయి. పి.గన్నవరం ఏరియా పశువైద్యశాల నిర్మించి 35ఏళ్లు కావస్తుంది. అప్పటి నుంచి ఈఏరియా ఆసుపత్రి పరిధిలోని పి.గన్నవరం, అంబాజీపే ట మండలాలకు సంబంధించి నాలుగు అను బంధ పశువైద్యశాలలను పర్యవేక్షణ చేస్తూ స మీప గ్రామాల పాడిపశువులకు, పలు జంతు వులకు సేవలందిస్తోంది. ఈక్రమంలో కొన్నాళ్ల క్రితం ఆసుపత్రి భవనం, దాణా గోదాము పూ ర్తిగా శిథిలం కావడంతో పాటు పరిసరాలు అ ధ్వానంగా మారాయి. గోదాము ఎదుట ఉన్న సి మెంట్ బాట పూర్తిగా ధ్వంసమైంది. వర్షం వస్తే చాలు పలు చోట్ల శ్లాబ్ నుంచి వర్షం నీరు లీకవుతోంది. అలాగే వర్షం వస్తే ఆసుపత్రి పరి సరాలు చెరువును తలపిస్తోంది. ఎన్ని ప్రభుత్వా లు మారినప్పటికీ శిథిలమైన పశువుల ఏరి యా ఆసుపత్రిని పట్టించుకున్న నాథుడే కరువ య్యాడని పలువురు తీవ్ర విమర్శలు చేస్తున్నా రు. అయితే గతంలో పనిచేసిన పశువైద్య సహా యసంచాలకులు పాత ఆసుపత్రి స్థానే నూతన ఆసుపత్రి విషయం ఉన్నతాధికారుల దృష్టికి తీ సుకువెళ్లినప్పటికి ఆసుపత్రి నిర్మాణం కార్యరూ పం దాల్చలేదు. స్థల సమస్య, నిర్మాణ సామగ్రి తీసుకువెళ్లే మార్గం లేకపోవడం వంటి కారణా లతో ప్రతిపాదనలు స్థాయిలోనే ఆసుపత్రి నిర్మా ణం ప్రక్రియ ఆగిపోయింది. అంతేకాకుండా ఏరి యా ఆసుపత్రి పరిధిలో స్థలం లేకపోవడంతో నియోజకవర్గ స్థాయి వ్యాధినిర్ధారణ కేంద్రాన్ని వైసీపీ హయాంలోనే పోతవరం పంచాయతీకి సమీపంలో నిర్మాణం ప్రారంభించారు. అయితే ఆ భవనం ఇంకా నిర్మాణ దశలోనే ఉంది. ఇప్ప టివరకుపాడిరైతులకు అందుబాటులోకి రాలేదు. పి.గన్నవరం మండలంలో ఎక్కువ లంకప్రాం తం కావడంతో అధిక సంఖ్యలో ఆవులు, గేదెలు ఉన్నాయి. పి.గన్నవరం, అంబాజీపేట మండలా ల పరిధిలో ఆవులు 7,008, గేదెలు 11,604, మే కలు, గొర్రెలు, పందులు 6వేలు వరకు ఉన్నా యని అధికారులు తెలిపారు. అలాగే ఏరియా ఆసుపత్రికి అనుసంధానంగా పి.గన్నవరం మం డలంలో మానేపల్లి, అంబాజీపేట మండలంలో ముక్కామల, పుల్లేటికుర్రు, అంబాజీపేట గ్రా మాల్లో పశువైద్యశాలలు ఉన్నాయి. అలాగే పి.గ న్నవరం మండలం నరేంద్రపురంలో గ్రామీణ పశువైద్యశాల ఉంది. ముక్కామల పశువైద్యశా ల పూర్తిస్థాయిలో శిథిలం కావడంతో రూ.20లక్ష ల నిధులతో నూతన భవనం నిర్మించారు. కానీ ఇంకా ప్రారంభానికి నోచుకోలేదు. దీంతో ము క్కామల ఆసుపత్రి పరిస్థితి మరింత దయనీ యంగా మారింది. దీంతో సమీప లంకప్రాంతా ల్లో ఉన్న పాడి రైతులు తీవ్ర ఇబ్బందులు పడు తున్నారు. పుల్లేటికుర్రులో కూడా పశువైద్యశాల శిథిలావస్థకు చేరుకుంటుంది. అంబాజీపేట పశు వైద్యశాలలో వైద్యులు లేక పాడిరైతులు ఇబ్బం దులు పడుతున్నారు. నరేంద్రపురం గ్రామీణ పశువైద్యశాల ఉద్యోగి డిప్యుటేషన్‌పై వేరే ప్రాం తానికి వెళ్లిపోవడంతో సమీప ప్రాంతాల పాడి రైతులకు వైద్య సేవలు సరిగా అందకపో వడంతో ఇబ్బందులు పడుతున్నారు.

ప్రధాన పంట కాల్వల్లో మురికి నీరు


పంటకాల్వల్లోకి ఏర్పాటుచేసిన మురికి గొట్టాల ద్వారా కాల్వల్లోకి చేరిన మురుకినీరు

మామిడికుదురు, మే 19(ఆంధ్రజ్యోతి): వేస విలో ప్రధాన పంటకాల్వలన్నీ మురికి కాల్వల ను తలపిస్తున్నాయి. కాల్వకు ఇరువైపులా ఉ న్న కుటుంబాల వారు మురుగు తూరలను కా ల్వలో ఏర్పాటు చేయడం వల్ల ఆ నీరు కాల్వ లో చేరి తీవ్ర దుర్గంధం వెదజల్లుతోంది. అధి కారుల పర్యవేక్షణ లేకపోవడంతో ఎవరికీ వారే మురుగు తూరలతో పాటు సెప్టిక్‌ట్యాంకు గొ ట్టాలను పంటకాల్వలోకి ఏర్పాటుచేయడంతో అవి మురుగుకాల్వలను తలపిస్తున్నాయి. ము రుగుకాల్వల్లా తయారవ్వడం వల్ల దోమలు పె రిగి అంటు వ్యాధులు ప్రబలే ఆస్కారం ఉంద ని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పెద పట్నం నుంచి మగటపల్లి వరకు, నగరం నుం చి ఈదరాడ వరకు గల ప్రధాన పంటకాల్వలు చెత్తాచెదారాలతో పాటు వాటర్‌బాటిళ్లు, వివిధ రకాల వ్యర్థాలతో మురికి కాల్వల్లా తయార య్యారని ఆరోపిస్తున్నారు. అధికారులు తూ తూమంత్రంగా అప్పుడప్పుడూ నామమాత్రం గా కాల్వ ఆధునికీకరణ పనులు చేపట్టి మమా అనిపిస్తున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. అం తేకాకుండా కాల్వలపై విచక్షణ రహితంగా ఎ క్కడపడితే అక్కడ వంతెనలు నిర్మిస్తున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. పెదపట్నం నుంచి మగటపల్లి వరకు కాల్వపై ఇష్టారాజ్యంగా ప లువురు నిబంధనలు అతిక్రమించి వంతెనలు నిర్మించినా సంబంధిత అధికారులు పట్టించుకో వడం లేదు. వంతెన నిర్మాణం వల్ల సాగునీటి ప్రవాహానికి అడ్డంకిగా మారి శివారు ప్రాంతా లకు సాగునీటి సమస్య ఏర్పడుతుందని రైతు లు పేర్కొంటున్నారు. అధికారులు ఈవంతెన నిర్మాణాలనుచూసీచూడనట్టు వ్యవహరిస్తున్నా రని విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా పంచాయతీ, నీటిపారుదల శాఖాధికారులు స్పందించి కాల్వ లో ఏర్పాటుచేసిన మురుగు తూరలు తొలగిం చి, కాల్వలపై ఏర్పాటుచేస్తున్న అనధికార వం తెనలు తొలగించి రైతులకు అవసరమయ్యేలా కాల్వలను ఆధునికీకరించాలని కోరుతున్నారు.

'దళితులపై ప్రభుత్వం కక్ష కట్టింది'
మలికిపురం, మే 19(ఆంధ్రజ్యోతి): దళిత వర్గాలు రాజకీయంగా అభివృద్ధి చెందుతున్నా యనే ఉద్దేశంతో కూటమి ప్రభుత్వం దళితు లపై కక్ష కట్టిందని మాజీ మంత్రి గొల్లపల్లి సూర్యారావు అన్నారు. సోమవారం విశ్వేశ్వరా యపురంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నందిగం సురేష్ పట్ల ప్రభు త్వం కక్ష సాధిస్తుందన్నారు. ప్రభుత్వం అభి వృద్ధి, సంక్షేమాన్ని మరిచి కక్ష సాధింపులకు పాల్పడుతుందన్నారు. సమావేశంలో తెన్నేటి కిశోర్, అడబాల బ్రహ్మాజీ, జిల్లెల్ల ఉదయ్, ఎం.వెంకట్రావు, చిట్టిబాబు పాల్గొన్నారు.

'చేనేత వ్యవస్థను నిర్వీర్యం చేస్తున్న ప్రభుత్వం'
మలికిపురం, మే 19(ఆంధ్రజ్యోతి): చేనేత సహకార సంఘాలను ప్రభుత్వం పట్టించుకో వడంలేదని, దీని వల్ల చేనేత వ్యవస్థ నిర్వీర్య మవుతుందని మాజీ సర్పంచ్, చేనేత సంఘ మాజీ అధ్యక్షుడు జాన శంకరరావు అన్నారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లా డారు. ప్రభుత్వం వెంటనే చేనేత సహకార సంఘాల ఎన్నికలు లేదా పాలకమండలిని నియమించాలని, చేనేత పథకాలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో కారుపర్తి భాస్కరరావు, చింతా సుధాకరరా వు, ఉప్పు సోమరాజు పాల్గొన్నారు.

రైతులు సేంద్రియ వ్యవసాయానికి ప్రాధాన్యం ఇవ్వాలి
మామిడికుదురు, మే 19(ఆంధ్రజ్యోతి): రై తులు సేంద్రియ వ్యవసాయానికి ప్రాధాన్యం ఇవ్వాలని మండల పంచాయతీ విస్తరణాధి కారి అడబాల శ్రీనివాస్ కోరారు. మామిడికు దురు ఎంపీడీవో కార్యాలయం వద్ద వ్యవసా యశాఖ రైతు సాధికార సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన సేంద్రియ వ్యవసాయం ద్వా రా పండించిన ఉత్పత్తుల స్టాల్‌ను ఆయన పరిశీలించారు. సేంద్రియ వ్యవసాయం ద్వా రా పండించిన పంటలకు మార్కెట్‌లో గిరాకీ ఉందన్నారు. ఈవిధంగా పండించిన పంటల ను ఆహారంగా తీసుకోవడం వల్ల ఏవిధమైన వ్యాధులు దరిచేరవని సూచించారు. కార్యక్ర మంలో సేంద్రీయ వ్యవసాయ రైతులు జాన కీ, రాధ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా రావులమ్మ జాతర


జాతరలో గరగల ఊరేగింపు

అంబాజీపేట, మే 19(ఆంధ్రజ్యోతి): కె.పెద పూడి గ్రామదేవత శ్రీరాజరాజేశ్వరి రావులమ్మ అమ్మవారి జాతర సోమవారం రాత్రి ఘనంగా నిర్వహించారు. అమ్మవారి జాతరలో గరగన్రు త్యాలతో పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. అమ్మవారి ఆలయాన్ని విద్యుత్ దీపాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. మంగళవారం అమ్మవారి తీ ర్థం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలి పారు. ఎస్ఐ కె.చిరం జీవి ఆధ్వర్యంలో పోలీస్ బందో బస్తు నిర్వహించారు.

వాడపల్లి వెంకన్న ఆదాయం రూ.4.14లక్షలు
ఆత్రేయపురం, మే 19(ఆంధ్రజ్యో తి): కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో సోమవారం వివిధ ప్రాంతాల నుండి వచ్చిన భక్తులు ద ర్శించుకున్నారు. నోము ఆచరించిన అష్టోత్తర పూజలు, నిత్యకళ్యాణాలు నిర్వహించుకున్నారు. స్వామివారిని దర్శించుకున్న భక్తులు అన్నప్ర సాదం స్వీకరించారు. వివిధ సేవల ద్వారా స్వామివారికి ఒక్కరోజు ఆదాయం రూ.4,14,159 లభించినట్లు ఉప కమిషనరు, ఈవో నల్లం సూర్యచక్రధరరావు తెలిపారు.

బైండోవర్ కేసు
అమలాపురం, మే19(ఆంధ్రజ్యోతి): అమలాపురం ప్రొహిబి షన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్ పరిధి అయినవిల్లి మండలంలో మ ద్యం అమ్మకాలు నిర్వహించే పాత ముద్దాయి కాకులపాటి వీర వెంకటసత్యనారాయణను తహశీల్దార్ ఎదుట బైండోవర్ చేసిన ట్టు ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ వీటీవీవీ సత్యనారాయణ తెలిపారు. అ యినవిల్లి తహశీల్దార్ ఆయనకు రూ.లక్ష ష్యూరిటీ విధించారు.

పి.గన్నవరం సీహెచ్‌సీ హెడ్‌నర్సు మృతి

పి.గన్నవరం, మే 19(ఆంధ్రజ్యోతి): పి.గన్నవరం సీహెచ్‌సీ హెడ్‌నర్సు జి.లక్ష్మీఅ నంతకుమారి(59) గుండెపోటుతో సోమ వారం మృతి చెందారు. లక్ష్మీఅనంత కుమారి తన కుమార్తె డెలవరి కోసం నెల రోజులుగా సెలవులో ఉన్నారు. స్వగ్రామం తణుకులో సోమవారం మధ్యాహ్నం ఆమెకు గుండెపోటు రావడంతో స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఆసుపత్రికి వెళ్లిన వెంటనే ఆమె మృతిచెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. 2023 జూన్ 30న ఆమె విధుల్లోకి చేరారు. హెడ్‌నర్సు మృతిపై ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ యు.రాఘవేంద్రరావు, సహచర వైద్యులు, సిబ్బంది సంతాపం తెలిపారు.

జూనియర్ ఎన్టీఆర్ పుట్టినరోజు వేడుకలు
మలికిపురం, మే 19(ఆంధ్రజ్యోతి): మలికిపురం గౌతమ్ స్కూలులో సోమవారం జూనియర్ ఎన్టీఆర్ 42వ పుట్టినరోజు వేడుకలను నిర్వహించారు. మలికిపురం, సఖినేటిపల్లి మండలాల ఎన్టీఆర్ ఫ్యాన్స్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. వంద మంది రక్తదానం చేశారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు, చెల్లుబోయిన శ్రీను, గెద్దం తులసీభాస్కర్, కాకి లక్ష్మణ్, కేతా శ్రీను, మంగెన నాని, చెల్లుబోయిన నాని, కానూరి బాబి తదితరులు పాల్గొన్నారు.

రుతుపవనాల సంసిద్ధతపై సమావేశం

యానాం, మే 19(ఆంధ్రజ్యోతి): రుతుపవనాల సంసిద్ధతపై విపత్తు నిర్వహణ శాఖ ఆధ్వర్యంలో అధికారులతో సోమవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. పరిపాలనాధికారి మునిస్వామి నేతృత్వంలో జరిగిన సమావేశంలో వివిధ శాఖలకు చెందిన అధికారులు పాల్గొన్నారు. రుతుపవనాల వచ్చే సమాయనికి తీసుకోవలసిన జాగ్రత్తలు, ఏర్పాట్లపై చర్చించారు. కార్యక్రమంలో ఆరోగ్య శాఖ డీడీ రవిశంకర్, డీటీ జె.వేంకటేశ్వరరావు, విద్యాశాఖాధికారి పంపన లక్ష్మణ ప్రవీణ్, సాంఘిక సంక్షేమశాఖ అధికారి నూరంపూడి రాజేంద్ర తదితరులు పాల్గొన్నారు.

సరస్వతీ పుష్కరాలకు ప్రత్యేక బస్సులు
రాజోలు, మే 19(ఆంధ్రజ్యోతి): ఏపీఎస్ ఆర్టీసీ రాజోలు డిపో నుంచి కాళేశ్వరం సరస్వతీ నదీ పుష్కరాలకు ప్రత్యేక బస్సులు సర్వీసులను ఈనెల 20, 22, 24 తేదీల్లో నడుపుతున్నామని డీఎం ధనమ్మ తెలిపారు. రాజోలులో సోమవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ సూపర్‌లగ్జరీ బస్సు టిక్కెట్ ధర రూ.2,200, ఇంద్ర ఏసీ బస్సు రూ.2,700గా నిర్ణయించామన్నారు. గదుల అద్దెలు, భోజన వసతులను యాత్రికులే భరించాలన్నారు. వరంగల్ శ్రీభద్రకాళీ మాత, వేములవాడ శ్రీరాజేశ్వరి అమ్మవారు, కొండగట్టు శ్రీఆంజనేయస్వామివారు, ధర్మపురి శ్రీలక్ష్మీనరసింహస్వామి, కాళేశ్వరం శ్రీమహాకాళేశ్వరుడు, పుష్కరస్నానం, రామప్ప దేవాలయ క్షేత్రాల దర్శనం ఉంటుందన్నారు. వివరాలు, టిక్కెట్ కోసం ఎస్ఎస్ బాబు సెల్: 9866177922, అసిస్టెంట్ మేనేజర్ సెల్: 9390485557, డిపో మేనేజర్ సెల్: 9959225538లో సంప్రదించాలని ఆమె కోరారు.

రహదారిని అభివృద్ధి చేయండి
అంబాజీపేట, మే 19(ఆంధ్రజ్యోతి): ఇరవై ఏళ్లుగా అభివృద్ధికి నోచుకోని భేతాళస్వామి ఆలయం నుంచి పోతాయిలంక వెళ్లే రహదారిని అభివృద్ధి చేయాలని స్థానికులు గ్రీవెన్స్‌లో అర్జీని అందించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం జరిగిన గ్రీవెన్స్‌లో స్థానిక నాయకులు నాగవరపు నాగరాజు, మట్టా వెంకటేశ్వరరావు, మైలా ఆనందరావు, ఉందుర్తి నాగబాబులు ఏవో నరసింహరావుకు అర్జీని అందించారు. ప్రభుత్వం ఈరహదారి నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని కోరారు.

వైభవంగా శ్రీతాటమ్మతల్లి అమ్మవారి సేవ

పి.గన్నవరం, మే 19(ఆంధ్రజ్యోతి): పి.గన్నవరం గ్రామదేవత శ్రీతాటమ్మతల్లి జాతర మహోత్సవాల్లో భాగంగా సోమవారం అమ్మవారి సేవా కార్యక్రమం వైభవంగా జరిగింది. గౌడసంఘం వారి సేవ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామ పురవీధుల్లో, ప్రధాన సెంటర్‌లో అమ్మవారి జాతర నిర్వహించారు. స్థానిక నాయకులు అమ్మవారిని దర్శించుకున్నారు. రేలంగి రామకోటేశ్వరరావు, అయినవిల్లి వెంకటేశ్వరరావు, పరమట సత్యనారాయణ, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

నేడు దాసులమ్మ తల్లి తీర్థం

కాట్రేనికోన, మే 19(ఆంధ్రజ్యోతి): చెయ్యేరులో గ్రామదేవత దాసులమ్మ తీర్థం ఈనెల20న నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. సోమవారం అమ్మవారి పెద జాగారం నిర్వహించారు. ప్రధాన ఆసాదు ఆధ్వర్యంలో పూజ ఘటాలకు పూజలు నిర్వహించారు. మంగళ వాయిద్యాలతో, మేళతాళాలతో, ఆసాదుల గరగన్రుత్యాలతో జాగారం వేడుకగా జరిగింది. భక్తులు స్వగృహాల వద్ద అమ్మవారికి పానుపులు వేసి భక్తి పూర్వకంగా కొలిచారు.

కేశనకుర్రు టీడీపీ అధ్యక్షుడిగా సుబ్బరాజు
ఐ.పోలవరం, మే 19(ఆంధ్రజ్యోతి): కేశనకుర్రు టీడీపీ గ్రామకమిటీ ఎన్నిక సోమవారం నిర్వహించారు. గ్రామ కమిటీ అధ్యక్షుడిగా చిలుకూరి సుబ్బరాజు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ప్రధాన కార్యదర్శిగా వనచర్ల వెంకటేశ్వరరావు, ఉపాధ్యక్షుడిగా చిక్కం శ్రీను ఎన్నికయ్యారు. సర్పంచ్ బీర సత్యకుమారి, గాదిరాజు శ్రీనురాజు, గాదిరాజు విశ్వనాధరాజు, ఇందుకూరి కేశవరామరాజు, ముదునూరి విజయరామరాజు, సలాది శేషారావు, కలిదిండి అప్పలనరసింహరాజు, యనమదల ఆదినారాయణ, పొగాకు సత్తికొండ తదితరులు నూతన కమిటీని అభినందించారు.

సీతారామచంద్రస్వామి ఆవిర్భావ శతాబ్ది మహోత్సవాలు
అయినవిల్లి, మే 19(ఆంధ్రజ్యోతి): అయినవిల్లిలంకలో వేంచేసిఉన్న శ్రీ సీతారామచంద్రస్వామి ఆవిర్భావ శతాబ్ది మహోత్సవాలు రెండో రోజు వైభవంగా నిర్వహించారు. సోమవారం విశ్వక్సేన పూజ, పుణ్యాహవచనం, మహాసుదర్శన అనుష్ఠాన పూర్వక మహా సుదర్శన హోమాలు నిర్వహించారు. గోదావరి జలాలు, సప్తనదీ జలాల సంగ్రహణం గోమాతతో 108కలములతో గ్రామప్రదక్షిణ పూర్వకంగా శోభాయాత్ర, అష్టోత్తర శతకలశ ద్రవ్య దేవతారాధనలు, స్వామివారి పంచ్ఛ శయ్యాదివాసములు జరిపించారు. అధికసంఖ్యలో భక్తులు స్వామివార్ని దర్శించుకుని పూజలు చేశారు.

వైద్యులకు సన్మానం


డాక్టర్ గొలకోటి రంగారావు దంపతులను సన్మానిస్తున్న వాకర్స్ హెల్త్‌క్లబ్ సభ్యులు

అమలాపురం టౌన్, మే 19(ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ కుటుంబ వైద్యుల దినోత్సవం సందర్భంగా అమలాపురం పట్టణానికి చెందిన ప్రముఖ వైద్యులు గొలకోటి రంగారావు కుటుంబ సభ్యులను, డాక్టర్లు ఆదిత్య-భవానీ దంపతులను హెల్త్‌క్లబ్ అధ్యక్షుడు బోనం సత్యవరప్రసాద్ ఆధ్వర్యంలో దుశ్శాలువాతో ఘనంగా సన్మానించారు. మాజీ కౌన్సిలర్ ఆశెట్టి ఆదిబాబు, వాకర్స్ క్లబ్‌కు చెందిన గోకరకొండ నాగేంద్ర, బూరగాయల శివరామకృష్ణ, పడాల నాయుడు, నూకల సత్యనారాయణ, చింతలపూడి సత్తిబాబు, గుర్రం రామకృష్ణ, యర్రమిల్లి సత్యనారాయణమూర్తి, పట్నాల రమణ, వాసిరెడ్డి సుబ్రహ్మణ్యేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతి
ముమ్మిడివరం, మే 19(ఆంధ్రజ్యోతి): పార్లమెంటు మొదటి ప్రతిపక్ష నాయకుడు, కమ్యూనిస్టు పార్టీ నాయకుడు పుచ్చలపల్లి సుందరయ్య 41వ వర్ధంతిని సోమవారం సీపీఎం పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించారు. ముమ్మిడివరంలోని పార్టీ కార్యాలయంలో సుందరయ్య చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. సీపీఎం మండల కార్యదర్శి సకిలే సూర్యనారాయణ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సుందరయ్య అందించిన సేవలను పలువురు కొనియాడారు. ఆయన జన్మించిన గ్రామం నుంచే వ్యవసాయ కార్మిక సంఘాన్ని ప్రారంభించి కార్మికుల అభ్యున్నతికి ఎన్నో పోరాటాలు సాగించారన్నారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు జి.దుర్గాప్రసాద్, పాము బాలయ్య, దొమ్మేటి వీరరాఘవులు, అనుచూరి లక్ష్మణరావు, కేవీపీఎస్ నాయకులు నిమ్మకాయల వెంకటేష్, యలమంచిలి బాలరాజు, కాకి రాంబాబు, సత్యనారాయణ, వెంకట్, మహ్మద్ హుస్సేన్, లక్ష్మి పాల్గొన్నారు.

కాట్రేనికోన, (ఆంధ్రజ్యోతి): పల్లంకుర్రు బిల్డింగ్ కనస్ట్రక్షన్ వర్కర్స్ ట్రేడ్ యూనియన్ ఆధ్వర్యంలో పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతి నిర్వహించారు. సుందరయ్య చిత్రపటానికి సీపీఎం నాయకులు విత్తనాల రాంబాబు, విప్పర్తి మోహనరావు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా సందర్భంగా మజ్జిగ చలివేంద్రాన్ని యూనియన్ అధ్యక్షుడు గంజా సత్తిబాబు ప్రారంభించారు. సూర్యనారాయణరాజు, జేమ్స్‌పాల్, రాయపురెడ్డి కృష్ణ, జె.మంగాదేవి, బి.దివ్యభారతి, జె.చినబాబు, పులుగు అర్జునరావు, ఇసుకపట్ల ప్రసాద్, అయితాబత్తుల రమేష్, రేవు వెంకటరమణ, కుమార్ పాల్గొన్నారు

పది విద్యార్థులకు సత్కారం
అంబాజీపేట, మే19(ఆంధ్రజ్యోతి): పదో తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులను సోమవారం సర్పంచ్ తనయుడు బండారు మల్లిబాబు ఆధ్వర్యంలో ముక్కామల పాఠశాలలో సత్కరించారు. ఈసందర్భంగా పేద విద్యార్థి సాకాదుర్గాభవానికి ఇంటర్మీడియట్ చదువు కోసం రూ.5వేలను మల్లిబాబు అందించారు. ఐదుగురి విద్యార్థులను సత్కరించి పుస్తకాలను అందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గెద్దం సింహాను ఇన్‌చార్జిగా నియమించండి
మలికిపురం, మే 19(ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ రాజోలు నియోజకవర్గ ఇన్‌చార్జిగా గెద్దం సింహాను ప్రకటించాలని రాజోలు నియోజకవర్గ ఎస్సీసెల్ సమావేశం తీర్మానించింది. విశ్వేశ్వరాయపురంలో గెద్దం సింహా ఇంటి వద్ద సోమవారం జరిగిన సమావేశంలో పాల్గొన్న 60గ్రామాల ఎస్సీల ప్రతినిధులు సమావేశంలో ప్రసంగించారు. ఎన్నికల ముందు, ఎన్నికల తరువాత నియోజకవర్గంలో జరిగిన సమగ్ర విషయాలపై చర్చించారు. రాజోలు నియోజకవర్గం రిజర్వుడు కావున ఎస్సీ అభ్యర్థినే ఇన్‌చార్జిగా నియమించాలని నిర్ణయం తీసుకున్నందుకు సీఎం చంద్రబాబునాయుడుకు కృతజ్ఞతలు తెలుపుతూ తీర్మానం చేశారు. నియోజకవర్గ ఎస్సీ సెల్ సభ్యులంతా సింహా పేరును ప్రతిపాదించగా ఏకగ్రీవంగా ఆమోదిస్తూ తీర్మానించారు. సింహాను నియమించాలని రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావును కోరారు. సమావేశంలో ముస్కూడి ఏసురత్నం, ఉండ్రాజవరపు బాబూరావు, రాపాక ఆనంద్‌కుమార్, ఉండ్రు రామకృష్ణ, కొల్లాబత్తుల వెంకటరమణ, రాపాక నవరత్నం, పొలమూరి శ్యామ్‌బాబు, కందికట్ల నిర్మల, కడలి దుర్గాదేవి, కోట పుష్పకుమారి, రాపాక మల్లికార్జునరావు, తాడి సత్యనారాయణ, నల్లి బాబూరావు తదితరులు పాల్గొన్నారు.

నేడు ముమ్మిడివరంలో మినీ మహానాడు
ముమ్మిడివరం, మే 19(ఆంధ్రజ్యోతి): ముమ్మిడివరం ఆర్టీసీ బస్టాండు వద్దనున్న డీఎల్ఎఫ్ ఫంక్షన్‌హాలులో మంగళవారం మధ్యాహ్నం 3గంటలకు మినీ మహానాడు నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే బుచ్చిబాబు తెలిపారు. ముమ్మిడివరం, కాట్రేనికోన మండలాలకు చెందిన పార్టీ నాయకులు, కార్యకర్తలు సమావేశ ప్రాంతానికి చేరుకోవాలని, ఐ.పోలవరం, తాళ్లరేవు మండలానికి చెందిన వారు మురమళ్ల పార్టీ కార్యాలయానికి చేరుకుని అక్కడి నుంచి ర్యాలీగా సమావేశ ప్రాంతానికి తరలిరావాలన్నారు.

పేకాట శిబిరంపై దాడి.. నలుగురి అరెస్టు
ముమ్మిడివరం, మే 19(ఆంధ్రజ్యోతి): రాణేలంకలోని ఓ నివాస గృహంలో పేకాట శిబిరంపై ఎస్ఐ డి.జ్వాలాసాగర్ ఆధ్వర్యంలో పోలీసులు దాడి చేశారు. నలుగుర్ని అరెస్టుచేసి సోమవారం కోర్టుకు హాజరుపరిచినట్టు ఎస్ఐ తెలిపారు. వారి నుంచి రూ.2వేల స్వాధీనం చేసుకున్నామన్నారు.

గడ్డివాము దగ్ధం
ఉప్పలగుప్తం, మే 19(ఆంధ్రజ్యోతి): నంగవరంలో ఆదివారం అర్ధరాత్రి జరిగిన అగ్నిప్రమాదంలో శీలం సత్యనారాయణకు చెందిన గడ్డివాము దగ్ధమైంది. ముమ్మిడివరం అగ్నిమాపకదళం సిబ్బంది మంటలను అదుపుచేశారు. అసలే ఎండుగడ్డి కొరతగా ఉన్న సమయంలో ఆరు ఎకరాల గడ్డివాము దగ్ధం కావడంతో పాడి పశువులను ఎలా పోషించాలని బాధిత రైతు ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు.

కాల్వ అభివృద్ధి పనులకు నిధులు మంజూరు
మామిడికుదురు, మే 19(ఆంధ్రజ్యోతి): మామిడికుదురు మండలంలో రూ.26లక్షలతో కాల్వ అభివృద్ధి పనులను నిర్వహించడానికి నిధులు మంజూరైనట్టు నీటిపారుదల శాఖ సహాయ ఇంజనీర్ సుందర్‌సింగ్ తెలిపారు. మానేపల్లి నుంచి పాశర్లపూడి వరకు పది కిలోమీటర్ల పొడవునా కాల్వలో పూడికతీత పనులకు రూ.10లక్షలు మంజూరయ్యాయని, ఈ పనులు జరుగుతున్నట్టు తెలిపారు. అదేవిధంగా మామిడికుదురులో రిటైనింగ్ వాల్ నిర్మాణం కోసం మరో రూ.10లక్షలు, మగటపల్లి, లూటుకుర్రు కాల్వల ఆధునికీకరణకు రూ.6లక్షలు మంజూరైనట్టు తెలిపారు. ఆయా పనులు త్వరితగతిన పూర్తిచేసేలా చర్యలు తీసుకుంటున్నట్టు తెలిపారు.

మండపేట

• కొత్తపేట • మండపేట • రామచంద్రపురం

సరస్వతి పుష్కరాలకు 2 బస్సులు

రామచంద్రపురం(ద్రాక్షారామ), మే 19(ఆంధ్రజ్యోతి): రామచంద్రపురం ఆర్టీసీ డిపో నుంచి సరస్వతి పుష్కరాలకు రెండు ఆర్టీసీ బస్సులు సోమవారం బయలుదేరాయి. డిపో ఏర్పాటు చేసిన బస్సులను ప్రయాణికులు వినియోగించుకోవడంపై డిపో మేనేజరు భాస్కరరావు వారికి కృతజ్ఞతలు తెలిపారు.

సర్పంచ్‌లకు చెక్ పవర్‌పై హర్షం

మండపేట, మే 19(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పనులకు సంబంధించిన చెల్లింపుల విషయంలో సర్పంచ్‌లకు చెక్‌పవర్ కల్పించటం పట్ల బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు కె.సత్యనారాయణ హర్షం వ్యక్తం చేశారు.



రాయవరం ఎంపీడీవో కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న రైతులు

పంటబోదెలోకి మురుగునీరు కలవకుండా

చర్యలు తీసుకోవాలి

రాయవరంలో చెల్లూరు రైతుల నిరసన

రాయవరం, మే 19(ఆంధ్రజ్యోతి): పంట బోదెలోకి మురుగునీరు చేరడం వల్ల పంటలు పండక ఇబ్బందులు పడుతున్నామని సమస్యను వెంటనే పరిష్కరించాలని కోరుతూ చెల్లూరు గ్రామానికి చెందిన రైతులు రాయవరం తహశీల్దారు, ఎంపీడీవో కార్యాలయాల ఎదుట సోమవారం నిరసన తెలిపారు. రైతులు మాట్లాడుతూ గ్రామంలో ఇళ్ల నుంచి వచ్చే వాడకం నీరు పంచాయతీ డ్రైనేజీల ద్వారా పోలేరమ్మ ఆలయం వెనుక ఉన్న పంటబోదెలోకి చేరడంతో వ్యర్థాలు, చెత్త, చెదారం పేరుకుపోయి మురుగుకూపంలా మారిందన్నారు. పంటబోదెపై సుమారు 100 ఎకరాల పంట సాగు జరుగుతుండగా రైతులు పంటలు పండక ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఎంపీడీవో, తహశీల్దారు కార్యాలయాల ఎదుట నిరసన తెలిపిన అనంతరం తహశీల్దారు, ఎంపీడీవోకు ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ దేవు వెంకట్రాజు, బొల్లంరెడ్డి పట్టాభి రామన్న, పుట్టా రామకృష్ణ, చుండ్రు రమేష్, వల్లూరి సాయికుమార్, పసల పనసయ్య రైతులు పాల్గొన్నారు.



జాబ్‌మేళాలో ఎంపికైన యువతీ, యువకులు

జాబ్‌మేళాలో 32 మంది ఎంపిక

రామచంద్రపురం(ద్రాక్షారామ), మే 19 (ఆంధ్రజ్యోతి): రామచంద్రపురం పట్టణంలోని ఉపాధి కార్యాలయంలో సత్యం వాసంశెట్టి ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన జాబ్ మేళాలో 32 మంది యువతీ, యువకులు ఎంపికయ్యారు. ఏషియన్ ఆటోపార్ట్స్‌కు 10 మంది, ఎఫ్టానిక్స్ కంపెనీకి 22 మంది ఎంపికయ్యారు. వీరికి సత్యం వాసంశెట్టి ఫౌండేషన్ ఛైర్మన్ వాసంశెట్టి సత్యం నియామక పత్రాలు అందచేశారు. కార్యక్రమంలో ఉపాధి ప్రతినిధులు, ఉపాధి ప్రాజెక్టు డైరెక్టర్ రామ్‌కుమార్, సీఈవో అనిల్ ఉండు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్టాండులో అవగాహన శిబిరం

రామచంద్రపురం(ద్రాక్షారామ), మే 19(ఆంధ్రజ్యోతి): రామచంద్రపురం బస్టాండులో సోమవారం తూనికలు, కొలతల శాఖ అధికారులు అవగాహన శిబిరం నిర్వహించారు. తూనికలు, కొలతలశాఖ ఇన్‌స్పెక్టర్ కుటుంబరావు మాట్లాడుతూ ఏ వస్తువైనా ఎమ్మార్పీ కంటే అదనపు సొమ్ము వసూలు చేయకూడదని, అలా వసూలు చేసిన పక్షంలో జరిమానా విధిస్తామన్నారు. కొనుగోలు చేసిన వస్తువు తయారీ, ఎక్స్‌పైరి తేదీలు తప్పనిసరిగా చూసుకోవాలన్నారు. ఎటువంటి ఇబ్బందులు వచ్చినా టోల్‌ఫ్రీ నెంబరు 1967కు ఫోన్ చేయాలని సూచించారు. కార్యక్రమంలో డిపో మేనేజరు భాస్కరరావు, దుకాణదారులతో పాటు వినియోగదారులు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న అధికారులు

టీడీపీలో గుమ్మిలేరు ఎంపీటీసీ చేరిక

ఆలమూరు, మే 19(ఆంధ్రజ్యోతి): ఆలమూరు మండలం గుమ్మిలేరు ఎంపీటీసీ యర్లగడ్డ రమేష్ చౌదరి వైసీపీని వీడి కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు సమక్షంలో సోమ వారం తెలుగుదేశం పార్టీలో చేరారు. కొత్తపేటలో సోమవారం జరిగిన మినీ మహానాడులో గుమ్మిలేరు టీడీపీ నాయకుల సమక్షంలో ఆయనకు ఎమ్మెల్యే పార్టీ కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో గుమ్మిలేరు టీడీపీ నాయకులు ఈదల వీర్రాజు, యాదగాని సతీష్ తదితరులు పాల్గొన్నారు.



గుమ్మిలేరు ఎంపీటీసీకి పార్టీ కండువా వేస్తున్న కొత్తపేట ఎమ్మెల్యే బండారు

టీడీపీ మండల అధ్యక్షుడిగా ఈదల, కార్యదర్శిగా సలాది

ఆలమూరు, మే 19(ఆంధ్రజ్యోతి): ఆలమూరు మండల తెలుగుదేశం పార్టీ నూతన కార్యవర్గ అధ్యక్షుడిగా ఆలమూరుకు చెందిన ఈదల సత్యనారాయణ(సత్తిబాబు)ను నియమించారు. సోమవారం జరిగిన నియోజకవర్గ మినీ మహానాడు కార్యక్రమంలో మండల అధ్యక్షుడిగా ఈదల సత్తిబాబు, కార్యదర్శిగా పెదపళ్లకు చెందిన సలాది నాగేశ్వరరావులను నియమిస్తూ ఆమోదించారు. అధ్యక్ష, కార్యదర్శులుగా నియమితులైన వారిని ఎమ్మెల్యే బండారు సత్యానందరావుతో పాటు పలువురు నేతలు అభినందించారు.

టీడీపీ ఆత్రేయపురం మండల అధ్యక్షుడిగా కూసంపూడి

ఆత్రేయపురం, మే 19(ఆంధ్రజ్యోతి): టీడీపీ మండల అధ్యక్షుడిగా కూసంపూడి రామకృష్ణంరాజు, ప్రధాన కార్యదర్శిగా గుడాల నాగేంద్ర ఎంపికయ్యారు. సోమవారం కొత్తపేట కాపు కల్యాణ మండపంలో నియోజకవర్గ స్థాయి మినీమహానాడు నిర్వహించారు. పార్టీ నాయకులు, కార్యకర్తల అభిప్రాయాలతో పార్టీ అధ్యక్ష, కార్యదర్శులను ఎంపిక చేసి పార్టీ అధిష్టానానికి నివేదిస్తున్నట్లు ఎమ్మెల్యే బండారు సత్యానందరావు ప్రకటించారు. ఎంపికైన రామకృష్ణంరాజును పార్టీ శ్రేణులు, కార్యకర్తలు అభినందించారు.

టీడీపీ రావులపాలెం మండల అధ్యక్షుడిగా ప్రసాద్

రావులపాలెం, మే 19(ఆంధ్రజ్యోతి): రావులపాలెం మండల టీడీపీ నూతన అధ్యక్షుడిగా కొప్పిశెట్టి ప్రసాద్ నియమితులయ్యారు. కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు కొత్తపేటలో జరిగిన టీడీపీ మహానాడులో మండల అధ్యక్షుడిగా ప్రసాద్‌ను ప్రకటించారు. దీంతో పార్టీ శ్రేణులు, నాయకులు ప్రసాద్‌కు అభినందనలు తెలిపారు.

వైభవంగా విగ్రహ ప్రతిష్ఠలు

కపిలేశ్వరపురం, మే 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నాగులచెరువు గ్రామంలో సోమవారం గోపాలకృష్ణస్వామి, గణపతి, వీరాంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠల కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. కపిలేశ్వరపురం మండలం మాచర వాస్తవ్యుడు పెదపూడి లక్ష్మీ జనార్ధనమూర్తి, కుమారుడు సీతారామాచార్యులు, గ్రామానికి చెందిన చొల్లంగి వెంకటేశ్వరరావు, శేషారత్నం, చొల్లంగి భాస్కరరావు, సూర్యకుమారి దంపతుల ఆధ్వర్యంలో మేడిశెట్టి శ్రీనివాసు, పరమేశ్వరి, మేడిశెట్టి త్రిమూర్తులు సత్యవతి, మేడిశెట్టి శ్రీనివాసు, వరలక్ష్మిల యాజమాన్యంలో ప్రతిష్ఠ కార్యక్రమాలను శాస్త్రోక్తంగా జరిపారు. అనంతరం ఆలయం వద్ద అన్నసమారాధన నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామస్థులతో పాటు వివిధ గ్రామాలకు చెందిన భక్తులు, అధిక సంఖ్యలో మహిళలు, ఆలయ కమిటీ పాల్గొన్నారు.



విగ్రహ ప్రతిష్ఠలో పాల్గొన్న భక్తులు

21, 22 తేదీల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం

కె.గంగవరం, మే 19(ఆంధ్రజ్యోతి): ఈనెల 21, 22 తేదీల్లో రామచంద్రపురం నుంచి కొత్తపేట, ముమ్మిడివరం విద్యుత్ సబ్ స్టేషన్‌లకు వెళ్లే టవర్లను తొలగించి కొత్తవి వేయనున్నారు. ఈ నేపథ్యంలో పామర్రు, అముజూరు, కూళ్ల, తామరపల్లి, సత్యవాడ, పాణింగపల్లి, యండగండి గ్రామాలతో పాటు కపిలేశ్వరపురం మండలంలోని కోరుమిల్లి, మాచర, వాకతిప్ప గ్రామాలకు 21, 22 తేదీల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని రామచంద్రపురం డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కె.రత్నాలరావు, కె.గంగవరం ఏఈ భాస్కరకుమార్ తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కపిలేశ్వరపురం, మే 19 (ఆంధ్రజ్యోతి): అంగర సబ్‌స్టేషన్‌లో రెండు కొత్త బ్రేకర్లను ఏర్పాటు చేస్తున్న నేపథ్యంలో మంగళవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని రామచంద్రపురం ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కె.రత్నాలరావు ఒక ప్రకటనలో తెలిపారు. సబ్‌స్టేషన్ పరిధిలోని కపిలేశ్వరపురం, అంగర, టేకి, మాచరమట్లు, శ్రీరామపురం, వెదురుమూడి, పడమరఖండ్రిక, నల్లూరు, కాలేరు, సుభద్రాపురం, అచ్యుతాపురం, వడ్లమూరు, వల్లూరు, నేలటూరు, గ్రామాల్లో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఆయన తెలిపారు.



అష్టోత్తర పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

వాడపల్లి వెంకన్న ఆదాయం

రూ.4.14 లక్షలు

ఆత్రేయపురం, మే 19(ఆంధ్రజ్యోతి): వాడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయానికి సోమవారం వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులతో రద్దీనెలకొంది. నోము ఆచరించిన భక్తులు అష్టోత్తర పూజలు, నిత్యకళ్యాణాలు జరిపారు. స్వామివారిని దర్శించుకున్న భక్తులు అన్న ప్రసాదంలో పాల్గొన్నారు. వివిధ సేవల ద్వారా ఒక్కరోజు ఆదాయం రూ. 4,14,159 వచ్చినట్టు ఉపకమిషనరు, ఈవో నల్లం సూర్యచక్రధరరావు తెలిపారు.

ఘనంగా జగన్మోహిని కేశవస్వామి మాస కల్యాణం

ఆత్రేయపురం, మే 19(ఆంధ్రజ్యోతి): ర్యాలి జగన్మోహిని కేశవస్వామి ఆలయంలో సోమవారం శ్రావణ నక్షత్ర మాస కల్యాణం నిర్వహించారు. విశ్వక్సేనపూజ, పుణ్యాహవచనం, నీరాజన మంత్రపుష్పం తదితర కార్యక్రమాలను నిర్వహించి స్వామివారి కల్యాణాన్ని జరిపారు. స్వామివారిని వేదిక వద్దకు తీసుకువచ్చి కల్యాణం నిర్వహించారు. ఆలయ ఈవో బీహెచ్‌వీ రమణమూర్తి వీటి ఏర్పాట్లను పర్యవేక్షించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు స్వామివారి కల్యాణాన్ని తిలకించి అన్న ప్రసాదంలో పాల్గొన్నారు.

ఆపరేషన్ సిందూర్ విజయంతో

రక్తదాన శిబిరం

రావులపాలెం, మే 19(ఆంధ్రజ్యోతి): రావులపాలెం సీఆర్సీలో టీమ్ నేను సైతం ఆధ్వర్యంలో మెగా రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. భారత సైన్యం ఆపరేషన్ సిందూర్ విజయవంతంగా పూర్తి చేసిన నేపథ్యంలో సంస్థ సభ్యులు ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ బండారు శ్రీనివాస్ ప్రారంభించారు. సంజీవిని బ్లడ్ బ్యాంక్ బృందం సంస్థ సభ్యులు దాతల నుంచి రక్తాన్ని సేకరించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో రక్తదాతలకు బండారు శ్రీనివాస్, టీడీపీ తెలుగు రైతు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆకుల రామకృష్ణ సీఆర్సీ అధ్యక్షుడు తాడి నాగమోహనరెడ్డి జ్ఞాపికలు అందచేశారు. కార్యక్రమంలో సీఆర్సీ ప్రధాన కార్యదర్శి నల్లమిల్లి వీరారాఘవరెడ్డి, జనసేన మండల శాఖ అధ్యక్షుడు తోట స్వామి, బండారు బాబి పాల్గొన్నారు. నేను సైతం సంస్థ అధ్యక్షుడు అంబటి కిషోర్‌ను సత్కరించారు.



రాజకీయ నాయకులతో సమావేశం నిర్వహిస్తున్న ఓటరు నమోదు ప్రత్యేక అధికారి

రాజకీయ నాయకులతో ఓటరు నమోదు ప్రత్యేకాధికారి సమావేశం

మండపేట, మే 19(ఆంధ్రజ్యోతి): మండపేట నియోజకవర్గ ఓటరు నమోదు ప్రత్యేక అధికారి, డిప్యూటీ కలెక్టర్ కె.ఆర్.ఆర్.సీ, పి.కృష్ణమూర్తి సోమవారం వివిధ రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం నిర్వహించారు. ఎన్నికల దరఖాస్తులు ఫారం 6, 7, 8 లకు సంబంధించి స్టేటస్ వివరాలతో పాటు ఎన్నికలకు సంబంధించిన పలు అంశాలపై ఆయన చర్చించారు. ఈ సమావేశంలో టీడీపీ, బీజేపీ, వైసీపీ, జనసేనతో పలు రాజకీయ పార్టీలకు చెందిన ప్రతినిధులు యూ.రాంబాబు, కె.కాశీవిశ్వనాథం, ఎ.ఎస్.చక్రపాణి, ప్రకాష్, తహసీల్దార్‌లు, తేజేశ్వరరావు, పి.చిన్నారావు, డిప్యూటీ తహసీల్దార్‌లు శ్రీనివాస్, మోహర్‌బాబా, సంధ్య, ఎన్నికల సీనియర్ అసిస్టెంట్ ఎం.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

భారీ వర్షంతో మునిగిన లోతట్టు ప్రాంతాలు



కోటిపల్లిలో భారీ వర్షానికి మునిగిన సోమేశ్వరస్వామి ఆలయ రహదారి

కె.గంగవరం, మే 19(ఆంధ్రజ్యోతి): మండలంలో సోమవారం ఉదయం భారీ వర్షం కురిసింది. దీంతో ఆయా ప్రాంతాల్లో లోతట్టు ప్రాంతాలు ముంపుబారిన పడ్డాయి. కోటిపల్లిలోని ఛాయాసోమేశ్వరస్వామి ఆలయం వద్దకు వెళ్లే రహదారి వర్షం నీటితో నిండిపోయింది. దీంతో ఆలయానికి వెళ్లే పలువురు భక్తులు ఇబ్బందిపడ్డారు. ముఖ్యంగా వరి పంటను మాసూళ్లు చేసుకున్న రైతులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. యంత్రాలతో కోసిన పంటలో తేమ శాతం తగ్గించి పుంత, కాలువగట్టులతో పాటు, దిమ్మలపైన రాశులు చేసి ఉంచారు. ఇప్పుడు వాటిని మిల్లులకు తరలించే పనిలో నిమగ్నమవుతున్న సమయంలో ఉదయం వర్షం పడటంతో రైతులు హైరానా పడ్డారు. ధాన్యం రాశులపై బరకాలు, టార్పాలిన్లను కప్పి వాటిని రక్షించుకునే ప్రయత్నం చేశారు. రాశులచుట్టూ నీరు చేరితే ధాన్యం పాడైపోతుందని వాపోతున్నారు. అకాల వర్షం వల్ల మరింత నష్టాలబారిన పడతామని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



పూతలగట్టున ఉన్న ధాన్యాన్ని సురక్షిత ప్రాంతానికి తరలిస్తున్న రైతులు

సీనియర్ ఐఎఎస్‌ల బృందం పర్యటనకు విస్తృత ఏర్పాట్లు



ద్వారపూడి పంచాయతీలో పారిశుధ్యం పనులు చేస్తున్న కార్మికులు

మండపేట, మే 19(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఈనెల 21, 22, 23 తేదీల్లో సీనియర్ ఐఎఎస్‌ల బృందం ఎంపిక చేసిన ఎస్సీ, ఎస్టీ ఏరియాల్లో పర్యటించనున్నారు. ఇందులో భాగంగా ద్వారపూడి పంచాయతీలో మూడు రోజుల పాటు పర్యటించి బస చేయనున్నారు. ఇప్పటికే మండలస్థాయి అధికారులు క్షేత్రస్థాయిలో చేపట్టాల్సిన పనులపై చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా శానిటేషన్‌పై దృష్టిసారించారు. ఎంపీడీవో సత్యనారాయణమూర్తి, డిప్యూటీ ఎంపీడీవో దాసరి శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శి ఆకుల వీవీ.రమణల పర్యవేక్షణలో అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. అధికారుల బృందం పర్యటిస్తున్న నేపథ్యంలో మండల, డివిజన్‌స్థాయి అధికారులు ద్వారపూడిపై ప్రత్యేక దృష్టిసారించారు.

రైతుల సంక్షేమానికి ప్రభుత్వం ప్రాధాన్యం

ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు

రాయవరం, మే 19(ఆంధ్రజ్యోతి): రైతుల సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు అన్నారు. సోమవారం వెంటూరు గ్రామంలో వ్యవసాయశాఖ ఆధ్వ ర్యంలో రైతులకు పవర్ టిల్లర్లు పంపిణీ నిర్వహించారు. వ్యవసాయశాఖ మండల అధికారి కె.ప్రభాకర్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ తొలి విడతగా మండలంలో 7 పవర్ టిల్లర్లు, మూడు రోటవేటర్స్, 6 దుక్కుసెట్లు, మూడు బ్యాటరీ స్ప్రేయర్లు అందజేశామన్నారు. మండల పరిధిలో 23 యంత్ర పరికరాలను సబ్సిడీపై రైతులకు అందజేశామన్నారు. అనంతరం ఎమ్మెల్యే రైతులకు పవర్ టిల్లర్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీడీపీ నేత రిమ్మలపూడి వేణుగోపాలదొర, మాజీ ఎంపీటీసీ కొప్పిశెట్టి మాధవరావు, టీడీపీ గ్రామశాఖ అధ్యక్షుడు దేవల్ల వెంకట్రావు, జనసేన అధ్యక్షుడు గొడితి సత్యం, ఎంపీడీవో ఎస్.కీర్తి స్పందన, తహశీల్దారు ఐవీ శెట్టి గ్రామ వ్యవసాయ సహాయకులు, రైతులు పాల్గొన్నారు.



వెంటూరులో రైతులకు పవర్ టిల్లర్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు



కట్టుంగ ఆర్ఎస్ఎస్ చానల్‌కు పడిన గండి

ఆర్ఎస్ఎస్ చానల్‌కు గండి

ఆత్రేయపురం, మే 19(ఆంధ్రజ్యోతి): లొల్ల లాకుల ద్వారా గన్నవరం కాలువ నుంచి కట్టుంగ వెళ్లే ఆర్ఎస్ఎస్ చానల్‌కు సోమవారం గండిపడింది. పంట పొలాలకు వెళ్లాల్సిన సాగునీరు డ్రైనేజీలోకి వృథాగా పోతోంది. దానికి మరమ్మతులు చేపట్టకపోతే సాగునీటి ఇబ్బందులు తలెత్తుతాయని రైతులు ఆందోళన చెందుతున్నారు. ప్రాజెక్టు కమిటీ వైస్ చైర్మన్ కరుటూరి నరసింహారావు, ఇరిగేషన్ డీఈ నాగేంద్రప్రసాద్, ఆర్డీవో శ్రీకర్‌లను కలిసి సమస్యను పరిష్కరించాలని కోరారు. గండిపూడ్చి డ్రైనేజీ నిర్మించేందుకు ప్రతిపాదనలు రూపొందించినట్లు ఏఈ వి.సాయిప్రసన్న మాధవ్ తెలిపారు.



టీడీపీ మినీ మహానాడులో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బండారు

పేదల పక్షపాతి టీడీపీ

మినీ మహానాడులో ఎమ్మెల్యే బండారు

కొత్తపేట, మే 19(ఆంధ్రజ్యోతి): పేదల ప్రయోజనాలు కాపాడుతూ రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకువెళ్లేది కూటమి ప్రభుత్వమేనని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు. సోమవారం కాపు కల్యాణ మండపంలో నియోజకవర్గ టీడీపీ మినీమహానాడు ఆయన అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. తొలుత పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు ఎన్టీఆర్ విగ్రహానికి నివాళులర్పించారు. అనంతరం 2024-25 సంవత్సరాల మధ్య మృతి చెందిన పార్టీ నేతలకు సంతాపం తెలిపారు. ఎన్టీఆర్‌కు భారతరత్న ప్రకటించాలని పలు అభివృద్ధి తీర్మానాలను తీర్మానించారు. సమావేశంలో నియోజకవర్గ పరిశీలకులు వాసిరెడ్డి రాంబాబు, ఆకుల రామకృష్ణ, కేవీ సత్యనారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అన్నా క్యాంటీన్‌కు శంకుస్థాపన: కొత్తపేట పాత బస్టాండ్ సెంటర్ సమీపంలో రూ.50లక్షలతో నిర్మించే అన్నా క్యాంటీన్ నిర్మాణానికి ఎమ్మెల్యే బండారు సత్యానందరావు సోమవారం శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ బూసి జయలక్ష్మి, ఉపసర్పంచ్ విళ్ల మారుతీప్రసాద్, నాయకులు దర్నాల రామకృష్ణ, రెడ్డి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

రహదారుల నిర్మాణానికి అధిక ప్రాధాన్యం

ఆలమూరు, మే 19(ఆంధ్రజ్యోతి): రహదారుల నిర్మాణానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోందని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు. గుమ్మిలేరు నుంచి పినపళ్ల వెళ్లే రహదారి నిర్మాణానికి రూ.1.20కోట్లు మంజూరు కావడంతో సోమవారం ఆయన శంకుస్థాపన చేశారు. గత ప్రభుత్వంలో రహదారులు అధ్వానంగా ఉండటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారన్నారు. కార్యక్రమంలో గుమ్మిలేరు సర్పంచ్ గుణ్ణం రాంబాబు, ఎంపీటీసీ యర్లగడ్డ రమేష్‌చౌదరి, నాయకులు వంక అన్నవరం, అముజూరు శ్రీనివాస్, వై.సతీష్, ఈదల సత్తిబాబు, మెర్ల గోపాలస్వామి తదితరులతో పాటు పలువురు అధికారులు పాల్గొన్నారు.

మహానాడుకు తరలిరండి

రామచంద్రపురం(ద్రాక్షారామ), మే 19 (ఆంధ్రజ్యోతి): ఈనెల 27, 28, 29 తేదీల్లో కడపలో జరుగుతున్న టీడీపీ మహానాడుకు పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొనాలని పార్టీ సీనియర్ నాయకుడు వాసంశెట్టి సత్యం కోరారు. రామచంద్రపురంలో నిర్వహించిన నియోజకవర్గ మహానాడుని విజయవంతం చేసిన వారందరికీ ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

క్లస్టర్ విధానంతో వీఆర్‌వోలకు అన్యాయం

రామచంద్రపురం(ద్రాక్షారామ), మే 19 (ఆంధ్రజ్యోతి): సచివాలయాలను రేషనలైజేషన్ పేరుతో తీసుకువస్తున్న క్లస్టర్ విధానంతో వీఆర్‌వోలకు అన్యాయం జరుగుతుందని వారు ఆందోళన వ్యక్తం చేశారు. సోమవారం తహసీల్దార్‌కు వినతిపత్రం అందచేశారు. కార్యక్రమంలో రాష్ట్ర వీఆర్‌వోల అసోసియేషన్ రాష్ట్ర ప్రచార కార్యదర్శి ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా గౌరవ అధ్యక్షుడు మద్దాల బాపూజీ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వెంకన్న జన్మనక్షత్ర పూజలు

కపిలేశ్వరపురం, మే 19 (ఆంధ్రజ్యోతి): అంగరలో ఉన్న వైభవ వెంకటేశ్వరస్వామి జన్మనక్షత్ర పూజలు సోమవారం ఘనంగా జరిగాయి. ఆలయ అర్చకులు కె.బాలబాలాజీ ఆధ్వర్యంలో పలువురు రుత్వికులు స్వామి వారికి ప్రత్యేక అలంకరణ చేశారు. అనంతరం జన్మనక్షత్రమైన శ్రవణా నక్షత్ర పూజలు, అభిషేకాలు, కలశపూజ తదితర పలు పూజలను వేదమంత్రాల మధ్య నిర్వహించారు.